ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
తిరుపతి
జిల్లా వార్తలు
గురువారం 6 జూన్ 2024



టెన్షన్..టెన్షన్!

వైసీపీ వీరవిధేయ పోలీసు అధికారుల్లో మొదలైన ఆందోళన

తిరుపతి(నేరవిభాగం), జూన్ 5: ఐదేళ్ళుగా వైసీపీ నాయకులు చెప్పిందే వేదంగా భావించి వారితో అంటకాగిన పోలీసు అధికారులు, సిబ్బందిలో గుబులు మొదలైంది. తమ భవిష్యత్తు పట్ల ఆందోళన పెరిగింది. బదిలీలతో సరిపెడతారా లేక ఏకంగా విచారణలు, కేసులు కూడా ఉంటాయా అనే చర్చ ఆ వర్గాల్లో విస్తృతంగా జరుగుతోంది.కొందరు దీర్ఘకాలిక సెలవులపై వెళ్ళి పోవడానికి రంగం సిద్ధం చేసుకుంటుండగా మరికొందరు ఇప్పటికే సిక్ లీవులు పెట్టేస్తున్నారు. 'నాయకుల మాటలు విని కొన్ని చోట్ల కేసులు బనాయించడం తమ నెత్తి మీదకు తెచ్చుకున్నట్లు అయిందని కొందరు అధికారులు వాపోతున్నారు. తాము పెట్టిన కేసుల మీద మళ్ళీ విచారణ మొదలైతే చిక్కుల్లో పడతామని...అదే జరిగితే ఉద్యోగాలు కూడా కోల్పోవడం జరగొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకరిద్దరు కరడుగట్టిన అధికారులు మాత్రం ఇందుకు విరుద్ధంగా ఇప్పటికీ ఉండడం విశేషం. 'ఏమవుతుంది...మహా అంటే ట్రాన్స్‌వర్ చేస్తారు.. లేకుంటే వీఆర్.. అదీ కాకుంటే సస్పెన్షన్.. ఇంతే కదా.' అని తిరుపతి కేంద్రంగా ఉండే అధికారులు ఇద్దరు వ్యాఖ్యానిస్తున్నట్లు చెప్పుకుంటున్నారు.

కొందరిలో ఆనందం

మరోవైపు ఐదేళ్లుగా ఉనికి కరువై ఉద్యోగాలు చేసుకుంటూ గడిపిన కొందరు టీడీపీ అధికారంలోకి రావడంతో ఉత్సాహంగా కనిపిస్తున్నారు. వేధింపులు.. సాధింపులతో సతమతం అయిన వీరు.. 'కష్టపడి పనిచేసే వారికి ఇంక గుర్తింపు వుంటుందబ్బా ' అంటున్నారు. తమ పనితీరుకు తగ్గ పోస్టింగ్ ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పోలీసు అధికారులు తిరుపతి జిల్లాలో పదుల సంఖ్యలో వున్నట్లు సమాచారం.

సత్యవేడు

సెంటిమెంట్ పదిలం

● ఇక్కడ గెలిచే పార్టీదే అధికారం

సత్యవేడు, జూన్ 5: సత్యవేడులో గెలిచే పార్టీయే రాష్ట్రంలో అధికారం చేపడుతుందన్న సెంటిమెంట్ ఈ ఎన్నికల్లో కూడా కొనసాగింది. ఉమ్మడి ఏపీలో టీడీపీ ఆవిర్భావం తరువాత 2009 ఎన్నికల్లో మినహా అన్ని ఎన్నికల్లో సత్యవేడు నియోజకవర్గంలో గెలిచిన పార్టీయే రాష్ట్రంలో అధికారం చేపడుతూ వస్తోంది. ఇందుకు నిదర్శనంగా 1983లో టీడీపీ అభ్యర్థి తలారి మనోహర్ గెలుపొందగా రాష్ట్రంలో టీడీపీ అధికారం చేపట్టింది. 1985లో మధ్యంతర ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఎం.సురాజ్ గెలుపొందగా టీడీపీదే అధికారం, 1989 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సి.దాసు గెలుపొందగా ఆ పార్టీ అధికారం చేపట్టింది, 1994లో టీడీపీ అభ్యర్థి ఎం.సురాజ్ గెలుపొందగా టీడీపీ అధికారంలోకి వచ్చింది, 1999లో టీడీపీ అభ్యర్థి శివప్రసాద్ గెలుపొందగా టీడీపీ అధికారం కొనసాగింది. 2004లో కాంగ్రెస్ అభ్యర్థి నారాయణస్వామి గెలుపొందగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 2009లో మాత్రం టీడీపీ అభ్యర్థి హేమలత గెలుపొందగా కాంగ్రెస్ పార్టీయే అధికారం చేపట్టింది. 2014లో విభజిత ఏపీలో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి తలారి ఆదిత్య గెలుపొందగా ఆ పార్టీ అధికారం చేపట్టింది. 2019లో వైసీపీ అభ్యర్థి ఆదిమూలం గెలుపొందగా వైసీపీ అధికారం చేపట్టింది. ప్రస్తుత ఎన్నికల్లో అయనే టీడీపీ తరఫున గెలుపొందగా రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారం చేపడుతుండడం విశేషం.

సాధించాను నాన్నా!



ముద్దుకృష్ణమ రాజకీయ వారసత్వాన్ని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ముందుకు తీసుకెళుతున్నారు.మంగళవారం రాత్రి నగరి ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే డిక్లరేషన్ అందుకున్న భానుప్రకాష్ కుటుంబసభ్యులతో కలిసి రామచంద్రాపురం మండల పరిధిలోని వెంకట్రామాపురం చేరుకున్నారు.తన తండ్రి, మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడికి సమాధి వద్ద ఘన నివాళి అర్పించడంతో పాటు డిక్లరేషన్‌ను సమాధిపై ఉంచి కొద్ది సేపు ప్రార్థనలు చేశారు.నామినేషన్ దాఖలుకు ముందు కూడా ఆయన తండ్రి సమాధి వద్ద పత్రాలను కాసేపు ఉంచి ఆర్వో కార్యాలయానికి బయల్దేరిన విషయం తెలిసిందే.

-పుత్తూరు అర్బన్



తిరుమల ఘాట్‌లో జీపు బోల్తా

ఆరుగురు భక్తులకు తీవ్రగాయాలు

తిరుమల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్ రోడ్డులో బుధవారం ఓ జీపు అదుపుతప్పి బోల్తాపడడంతో ఆరుగురు భక్తులకు తీవ్రగాయాలయ్యాయి. వివిధ ప్రాంతాలకు చెందిన 11 మంది భక్తులు శ్రీవారి దర్శనం ముగించుకుని బుధవారం ఉదయం జీపులో తిరుమల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. 24వ మలుపు వద్ద జీపు అదుపుతప్పి పిట్టగోడను ఢీకొనడంతో బోల్తాపడింది.జీపులో వున్న ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా, మరికొందరు స్వల్పగాయాల పాలయ్యారు.వారంతా కేకలు వేయడంతో వెనుకవస్తున్న వాహనదారులు క్షతగ్రాతులను 108 అంబులెన్స్‌లో తిరుపతిలోని రుయాస్పత్రికి తరలించారు.ట్యాక్సీ డ్రైవర్ కునికిపాటే ప్రమాదానికి కారణమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రుయాస్పత్రికి ప్రత్యేక అడ్మిన్



మే 20న బాధ్యతలు స్వీకరించిన కనక నరసారెడ్డి

తిరుపతి (వైద్యం),జూన్5: ఎస్వీ వైద్య కళాశాలతో పాటు దానికి అనుబంధంగా ఉన్న రుయాస్పత్రికి ప్రత్యేక అడ్మినిస్ట్రేటర్ పోస్టును సృష్టించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.వైసీపీ ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో భాగంగా మార్చి 10న జీవో విడుదల చేసింది. తిరుపతి ఆర్డీవోగా పనిచేసిన కనకనరసా రెడ్డిని రుయా అడ్మిన్‌గా నియమించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆ మేరకు గత నెల 20న వైద్యఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.ఎన్నికల క్రతువు ముగిసిన అనంతరం బుధవారం రుయా అధికారులను కలిశారు. గతంలో ఆస్పత్రి వర్కింగ్ చైర్మన్‌కు కేటాయించిన ఛాంబర్‌ను ఏర్పాటుచేసే పనిలో యంత్రాంగం ఉంది.స్విమ్స్, బర్డ్ ఆస్పత్రులపై టీటీడీ జేఈవో పర్యవేక్షణ ఉన్నట్టు రుయా, ఎస్వీఎంసీ పరిపాలనా బాధ్యతలను ఐఏఎస్ స్థాయి అధికారికి అప్పగించాలని వైసీపీ ప్రభుత్వం భావించింది. వైద్యకళాశాల ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ స్థాయిలో ఉన్న అధికారులు విముఖత చూపుతుండటంతో ఇది వాయిదా పడుతూ వచ్చింది. ఎన్నికల ముందు తీసుకున్న నిర్ణయం కొనసాగుతుందా? లేదా రద్దవుతుందా? అన్న చర్చ జరుగుతోంది.



మొదటి విజేతను ప్రకటిస్తున్న ఆంధ్రజ్యోతి సిబ్బంది

'ఎవరు గెలిచినా మీదే గెలుపు'

విజేత తిరుపతివాసి

ఆంధ్రజ్యోతి కార్యాలయంలో లక్కీడ్రా

నలుగురు విజేతలకు బహుమతులు

తిరుపతి , జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : 'శాసనసభ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు?' అనే అంశంపై ఆంధ్రజ్యోతి నిర్వహించిన లక్కీడ్రాకు పాఠకుల నుంచి విశేష స్పందన లభించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాల్లో ఏ పార్టీ అత్యధిక స్థానాలు గెలుపొందుతుందో పాఠకుల నుంచే అంచనాలు వేస్తూ కూపన్లు స్వీకరించిన విషయం తెలిసిందే. అలా వచ్చిన వేలాది కూపన్ల నుంచి బుధవారం సాయంత్రం తిరుపతిలోని ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో లక్కీ డ్రా ద్వారా విజేతలను ఎంపిక చేశారు. కూపన్లు పంపిన వారిలో తిరుపతిలోని చంద్రబాబు నాయుడు కాలనీకి చెందిన పి.శ్రీనివాసులు ప్రథమ బహుమతి కింద 10వేల రూపాయలు గెలుచుకున్నారు. అలాగే మూడు ద్వితీయ బహుమతులను తిరుపతి సమీపంలోని తిరుచానూరు శంకర నాయుడు కాలనీకి చెందిన సీఆర్ ఖాదర్ బాషా, తిరుపతిలోని కుమ్మరతోపునకు చెందిన వి.మురళీకృష్ణ, చిత్తూరు గ్రీమ్స్‌పేటలోని గాయత్రీనగర్‌కు చెందిన ఈఎం ప్రసాద్ గెలుచుకున్నారు. వీరికి రూ.5వేల చొప్పున బహుమతులను త్వరలో అందజేస్తారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వర రావు, బ్రాంచ్ మేనేజరు సురేష్ రెడ్డి , అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజరు ఈశ్వరనాయుడు, సర్క్యులేషన్ మేనేజరు ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

గురుమూర్తి ఎలా గెలిచారంటే..!



వరప్రసాద్



గురుమూర్తి

కూటమి నుంచి క్రాస్ ఓటింగే వరప్రసాద్ కొంప ముంచింది

తిరుపతి ఎంపీ ఫలితంపై జోరుగా చర్చలు

తిరుపతి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ కూటమి అభ్యర్థులే ఘన విజయం సాధించినా కూటమి భాగస్వామి అయిన బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ ఓడిపోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఏడు అసెంబ్లీ స్థానాల్లోని అసెంబ్లీ అభ్యర్థులకూ, ఎంపీ అభ్యర్థికీ పడిన ఓట్ల తేడాను పరిశీలిస్తే క్రాస్ ఓటింగ్ జరిగిందనేది స్పష్టమవుతోంది. ఏడు అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులందరి ఆధిక్యత కలిపి 1.90 లక్షలు కాగా ఇంచుమించు అంతే ఆధిక్యతతో గెలవాల్సిన కూటమి (బీజేపీ) ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు 14వేలకు పైగా తేడాతో ఓటమిపాలయ్యారు.ఈ ఏడు అసెంబ్లీ స్థానాల్లోనూ వైసీపీ అభ్యర్థుల కంటే ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి మద్దిల గురుమూర్తికి ఎక్కువ ఓట్లు వచ్చాయి. మొత్తం ఏడు అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులకు వచ్చిన మొత్తం ఓట్లు 7.40 లక్షలు కాగా ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావుకు మాత్రం 6.08 లక్షలు మాత్రమే వచ్చాయి. అంటే 1.32 లక్షల ఓట్లు తగ్గాయి. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా చూస్తే గూడూరులో ఎమ్మెల్యే అభ్యర్థి కంటే 24,996 ఓట్లు, సూళ్ళూరుపేటలో 20,575 ఓట్లు, సర్వేపల్లిలో 20,396 ఓట్లు, సత్యవేడులో 19,540 ఓట్లు, శ్రీకాళహస్తిలో 18,100 ఓట్లు, వెంకటగిరిలో 17,390 ఓట్లు, తిరుపతిలో 11,421 ఓట్లు చొప్పున ఎంపీ అభ్యర్థికి తక్కువగా వచ్చాయి. గత ఎన్నికల్లో గూడూరు ఎమ్మెల్యేగా వైసీపీ నుంచీ గెలిచిన వరప్రసాదరావు తాజా ఎన్నికల్లో నోటిఫికేషన్ సమయంలో బీజేపీలో చేరి తిరుపతి ఎంపీ టికెట్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. అందువల్ల కూటమి శ్రేణుల్లో లోలోపల అసంతృప్తి రగిలిన ఫలితంగానే క్రాస్ ఓటింగ్ జరిగినట్టు ప్రచారం జరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభంజనం కొనసాగి 21 ఎంపీ స్థానాలు గెలుచుకున్నా చేజేతులా మరొక ఎంపీ సీటు పోగొట్టుకున్నామన్న వేదన కూటమి వర్గాల్లో వ్యక్తమవుతోంది.

స్థానం	చెల్లిన ఈవీఎం ఓట్లు	వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఓట్లు	వైసీపీ ఎంపీ అభ్యర్థి ఓట్లు	వైసీపీ ఎంపీ అభ్యర్థికి అదనపు ఓట్లు	కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఓట్లు	కూటమి ఎంపీ అభ్యర్థి ఓట్లు	కూటమి ఎంపీ అభ్యర్థికి తగ్గిన ఓట్లు
గూడూరు	192117	80929	96690	15,761	100844	75848	24996
సర్వేపల్లి	193913	86249	96754	10,505	102243	81847	20396
సత్యవేడు	183150	81311	94417	13,106	84626	65086	19540
శ్రీకాళహస్తి	206536	77575	88347	10,772	119554	101454	18100
సూళ్ళూరుపేట	201186	81362	90252	8,890	109724	89149	20575
తిరుపతి	189502	60950	63727	2,777	121205	109784	11421
వెంకటగిరి	196991	87262	96515	9,253	102716	85326	17390
మొత్తం	13,63,395	5,55,638	626702	71,064	7,40,912	608494	1,32,418



ఆస్పత్రి ఆవరణలో నిరుపయోగ వస్తువులు

శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి నానాటికీ తీసికట్టుగా తయారైంది. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రోగుల సేవకు దూరమైంది. కార్పొరేట్‌కు దీటుగా సేవలందించాలని టీడీపీ ప్రభుత్వం నెలకొల్పిన ఈ ఆస్పత్రి దయనీయస్థితికి చేరుకుంది. కనీస వసతులూ కొరవడడంతో రోగుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. అధికారుల ఇష్టారాజ్యం దీనికి శాపమైంది. టీడీపీ ప్రభుత్వం మళ్లీ ఏర్పాటు కానున్న నేపథ్యంలో ఆస్పత్రికి పూర్వ వైభవం వస్తుందని ప్రజానీకం ఎదురుచూస్తోంది.

- శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి ఆస్పత్రికి

నిర్లక్ష్యపు సుస్తీ!

టీడీపీ ప్రభుత్వ హయాంలో విశేష సేవలు

నేడు కనీస వసతులు కూడా కరువు

అదనపు భవన నిర్మాణంలో అవినీతి రోగం

అందుబాటులో లేకుండా వైద్యుల ఇష్టారాజ్యం

నాడు విశేష వైద్య సేవలు

శ్రీకాళహస్తిలో 1999లో అప్పటి టీడీపీ ప్రభుత్వం వంద పడకలతో ప్రభుత్వ వైద్యశాలను ఏర్పాటు చేసింది. మాజీమంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి దీని ఏర్పాటులో కీలక భూమిక పోషించారు. శ్రీకాళహస్తి వాసులకే కాకుండా సత్యవేడు, సూళ్ళూరుపేట,నాయుడుపేట, వెంకటగిరి నియోజకవర్గాల రోగులకూ ఈ ఆస్పత్రి అండగా ఉండేది. నిరంతరం విశేష శస్త్రచికిత్సలు జరిగేవి. ఉచిత డయాలసిస్ కేంద్రం మెరుగైన సేవలందించేది.

కాంగ్రెస్ హయాంలో కష్టాలు మొదలు

2004లో కాంగ్రెస్ పభుత్వం వచ్చాక ఆస్పత్రికి ఒడిదొడుకులు మొదలయ్యాయి. పదేళ్లపాటు ప్రభుత్వం అసలు శ్రద్ధ చూపకుండా గాలికొదిలేసింది. 2014లో మళ్లీ టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక బొజ్జల చొరవతో 16మంది స్పెషలైజేషన్ డాక్టర్లను నియమించారు.ఆపరేషన్ థియేటర్, ఎక్స్‌రే విభాగాలకు పరికరాలను సమకూర్చారు.దాతల సాయంతో అంబులెన్సు సమకూర్చారు. ఆస్పత్రిలో ఉచిత డయాలసిస్ కేంద్రాన్ని నెలకొల్పారు. దీంతో కిడ్నీ బాధితులు ఉచితంగా వైద్యసేవలు పొందారు. ఆస్పత్రిలో అప్పట్లో ఓపీ సంఖ్య 1,200 వరకూ నమోదయ్యేది. ఇప్పుడు ఆ సంఖ్య 300కు పడిపోయింది.

జగన్ పాలనలో ఆస్పత్రిపై నిర్లక్ష్యం

2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆస్పత్రి అధికారుల్లో అలసత్వం అలుముకుంది. అడిగేవారే లేకపోవడంతో వైద్యుల ఇష్టారాజ్యమైంది. కొత్త హాజరు విధానంతో చుట్టపుచూపుగా మారిపోయారు. ప్రైవేటు క్లినిక్కులు నిర్వహిస్తూ ఓపీకి రావడమే తగ్గించేశారు. డ్యూటీ మెడికల్ ఆఫీసర్ ఆస్పత్రిలో ఉండడం లేదనే విమర్శలున్నాయి. శస్త్రచికిత్సల సంఖ్య కూడా 90శాతానికి పైగా పడిపోయింది.

నాడు-నేడులో అవినీతి చూడు..

నాలుగేళ్ల క్రితం నాడు-నేడు కింద ఆస్పత్రిలో రూ.12కోట్లతో ప్రారంభించిన పనులు అరకొరగానే మిగిలిపోయాయి. ఈ పనుల్లో భారీ అవినీతి జరిగినట్లు ఆరోపణలున్నాయి.నాణ్యతాలోపాలే అందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. గతేడాది నవంబరులో వర్షాలకు కొత్త అదనపు అంతస్తు నుంచి పెద్ద లీకేజీలు బయటపడ్డాయి. చిన్నపిల్లల వార్డు, ఆర్ఎంవో గదిలో రికార్డులు కూడా తడిసిపోయాయి. పలుచోట్ల ఏసీలు అమర్చలేదు. కాన్పుల గదిలో ఏసీతప్పని సరి. నాసిరకం వాల్‌పైప్స్ అమర్చడంతో గోడ నుంచి టైల్స్ పెచ్చులూతున్నాయి. స్థలం కేటాయించినా లిఫ్టు పనులు ప్రారంభించలేదు. కొన్ని పనులు చేయకుండా వదిలేశారు. ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు నాణ్యతా ప్రమాణాలను తనిఖీ చేసి ధృవీకరించాకే అధికారులు పనులను ప్రారంభించాలి. కానీ ఎన్నికల కోడ్‌కు వారం రోజుల ముందు వైసీపీ నేతలు, ఆస్పత్రి అధికారులు ఆదరాబాదరాగా అదనపు అంతస్తుకు ప్రారంభోత్సవం చేసేశారు. పనులు పూర్తికాకుండానే ప్రారంభోత్సవం చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



నిరుపయోగంగా జనరేటర్

నర్సింగ్ వ్యవస్థ నిర్వీర్యం

- అత్యవసర విభాగం వద్ద గత టీడీపీ ప్రభుత్వం నెలకొల్పిన ఆర్వో ప్లాంట్ ఏడాది క్రితం మరమ్మతులకు గురైనా పట్టించుకోవడంలేదు. స్థానికంగా బోరు నుంచి ప్లాస్టిక్ ట్యాంకులో సరఫరా చేసే నీరే రోగులకు దిక్కయింది.. ఆ తాగునీటి కుళాయి నాచుతో దర్శనమిస్తోంది.
- ఏడాది క్రితం పాతజనరేటర్ తొలగించి కొత్తది ఏర్పాటు చేసినా ఇప్పటి వరకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. కరెంటుపోతే అంధకారం అలుముకుంటోంది. దోమలతో రోగులు అల్లాడిపోతున్నారు.
- ఉద్యోగులకు విధులు కేటాయించే అధికారులు ఆస్పత్రి సొంత సామ్రాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వైసీపీ నేతల సిఫార్సులుంటే ఏ పనీ చేయకుండానే జీతం పొందే వీలు కల్పించారు.
- కీలకమైన అధికారులకు ఇంటికి వెళ్లి సేవలందించే ఓ హెడ్‌నర్సుకు మూడేళ్లుగా నైట్ డ్యూటీ వేయడంలేదనే విమర్శలున్నాయి.
- ఫార్మసీ నుంచి కొందరు అధికారులు మందులను క్లినిక్‌లకు తరలించుకుపోతున్నట్లు ఆరోపణలున్నాయి.
- కాన్పుల కోసం ఉపయోగించే ఆక్సిటోషిన్ సూదులను ఒక అధికారి విచ్చలవిడిగా ఇంటికి తీసుకువెళ్లడం బహిరంగ రహస్యమైంది.
- కీలక అధికారికి చనువుగా ఉండే ఐదుగురు స్టాఫ్ నర్సులకు సరైన విధులు కేటాయించడంలేదు. నర్సింగ్ వ్యవస్థను నిర్వీర్యం చేశారు.



పనిచేయని ఆర్వోప్లాంట్











వానా వానా వెల్లువాయె!

వర్షంతో చల్లబడ్డ తిరునగరి




తిరుపతి అర్బన్, జూన్ 5: ఎండల తీవ్రత,ఉక్కపోతతో అల్లాడుతున్న తిరుపతి వర్షంతో ఒక్కసారిగా చల్లబడింది. బుధవారం మధ్యాహ్నం మంచివర్షం కురవడంతో వాతావరణం మారింది.మేఘావృతమైన ఆకాశం,పొగమంచు అలుముకున్న తిరుమల కొండలు కనువిందు చేశాయి.డ్రైనేజీ కాలువలతో పాటు వర్షపునీరు జోరుగా పారడంతో



ప్రధాన రోడ్లన్నీ జలమయమయ్యాయి. లక్ష్మీపురం కూడలి, తిరుచానూరు రోడ్డు,ఆర్టీసీ బస్టాండు, చేపలమార్కెట్, రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతాల్లో రోడ్లపై వర్షపునీళ్ల జోరుగా ప్రవహించాయి. వాహనాల రాకపోకలకు కొంత ఇబ్బందులు ఏర్పడ్డాయి.పాదచారులు రోడ్డు దాటలేక అవస్థలు పడ్డారు. మురికికాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు రోడ్లపైకి కొట్టుకొచ్చాయి.




నానీపై హత్యాయత్నం కేసులో
పెరిగిన దర్యాప్తు వేగం
మరికొందరు నేతల పేర్లు చేర్చే ఆలోచనలో సిట్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 5 : తిరుపతిలోని మహిళా వర్శిటీ వద్ద గత నెల 14న టీడీపీ చంద్రగిరి అభ్యర్థి పులివర్తి నానీపై జరిగిన హత్యాయత్నం కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.ఇటీవల సిట్ అధికారి, డీఎస్పీ రవిమనోహరాచారిని పులివర్తి నానీ కలసి తనపై దాడికి సూత్రధారులైన చెవిరెడ్డి భాస్కర రెడ్డి, మోహిత్ రెడ్డి,రఘునాథ రెడ్డి తదితరులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఆధారాల కోసం వెతికిన పోలీసులు ఈ కేసులో నిందితులను ప్రోత్సహించిన వారి పేర్లు చేర్చే ఆలోచనలో వున్నట్లు తెలిసింది. ప్రధానంగా ఇదే కేసులో కడప సెంట్రల్ జైలులో వున్న భానుకుమార్ రెడ్డికి, రామిరెడ్డిపల్లి సర్పంచ్ చంద్రశేఖర రెడ్డికి మధ్య సంబంధాలు వున్నట్లు గుర్తించిన పోలీసులు ఆ కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.ఈ కేసులో కొత్తగా చాలా పేర్లు చేర్చే అవకాశముండడంతో సూత్రధారుల్లో గుబులు మొదలైంది.

అమ్మవారి సేవలో పులివర్తి నాని



తిరుచానూరు, జూన్ 5: చంద్రగిరి ఎమ్మెల్యేగా ఎన్నికైన పులివర్తి నానీ బుధవారం కుటుంబ సమేతంగా తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా నానీ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీఈవో శేఖర్

తిరుచానూరు, జూన్ 5: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా విద్యాశాఖాధికారి వి.శేఖర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తిరుచానూరు జడ్పీ పాఠశాలలో విద్యాశాఖ, ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలను నిర్వహించారు. విజేతలకు ఆయన బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ తప్పిదాల వలన పర్యావరణం కలుషితమై ప్రమాదంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణానికి పెనుసవాల్‌గా మారిన ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. అధికారులు ధనుంజయసారథి, సురేష్, శివశంకర్, కోదండపాణి, మేఘనాథ్, సౌజన్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి బ్రహ్మరథం పట్టడం శుభపరిణామం


కేక్ కట్ చేస్తున్న సీఆర్ రాజన్ తదితరులు

తిరుచానూరు, జూన్ 5: టీడీపీకి ప్రజలు బ్రహ్మరథం పట్టడం శుభపరిణామమని ఆ పార్టీ పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు సీఆర్‌రాజన్ అన్నారు. బుధవారం తిరుచానూరులోని తన నివాసం వద్ద శ్రేణుల ఆధ్వర్యంలో భారీకేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి అరాచక పాలనకు విసిగి వేసారిన ప్రజలు ఎన్డీయే కూటమికి కనివిని ఎరుగని రీతిలో విజయాన్ని అందించడం ఆనందంగా ఉందన్నారు. పార్టీ కార్యకర్తలు బాణసంచా పేల్చి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కిషోర్‌రెడ్డి, సాయి రాయల్, మునిరత్నంరెడ్డి, సాల్మన్‌రాజు, రమణ, రమేష్, మోహన్‌రెడ్డి, తదితరులుపాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న టీడీపీ నాయకులు


తలనీలాలు సమర్పించి వినాయకునికి మొక్కులు తీర్చుకున్న సప్తగిరి కాలనీ టీడీపీ నాయకులు

మంగళం, జూన్ 5: పులివర్తి నానీ గెలుపొందడంతో మంగళం సప్తగిరి కాలనీ గ్రామపంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు బుధవారం కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి సన్నిధిలో మొక్కులు తీర్చుకున్నారు. నియోజకవర్గ బీసీసెల్ ఉపాధ్యక్షులు సుబ్బయాదవ్, పంచాయతీ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, అల్లాబాషా, నారాయణ, భానుప్రకాష్, అప్పిలి ప్రసాద్, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం: ఎమ్మెల్యేగా పులివర్తి నాని ఎన్నికయ్యారని సంతోషం వ్యక్తం చేస్తూ కమ్మకండ్రిగ గ్రామస్థులు బుధవారం విజయగణపతి ఆలయం వద్ద 501 టెంకాయి కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. బాణసంచా పేల్చి ఒకరిపై ఒకరు రంగులు చల్లుచకుని సంబరాలు చేసుకున్నారు.


కమ్మకండ్రిగలో కొబ్బరికాయలు కొడుతున్న గ్రామస్థులు

అవిలాలలో టీడీపీ నేతల సంబరాలు

తిరుపతి రూరల్, జూన్ 5: అవిలాల గ్రామ పంచాయతీ పరిధిలో టీడీపీ నేతలు బుధవారం సంబరాలు నిర్వహించారు. నానీ ఫోటో ఉంచి బారీ కేక్ కట్ చేసి విజయోత్సవం జరుపుకొన్నారు. ఈసందర్భంగా టీడీపీ సీనియర్ నేత పయ్యావుల శ్రీధర్ మాట్లాడుతూ వైసీపీ నేతల అరాచకాలు, దౌర్జన్యాలే ఆ పార్టీని భూస్థాపితం చేశాయన్నారు. ఉద్దగిరి ప్రసాద్, వెంకటముని, సుధాకర్, హరి, భాస్కర్, ఉదయ్‌కుమార్, సాంబశివయ్య తదితరులు పాల్గొన్నారు.

అవిలాలలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నేతలు



చంద్రగిరిలో బీజేపీ నాయకుల కోలాహలం


కోదండరామాలయం వద్ద సంబరాలు చేసుకొంటున్న నేతలు

చంద్రగిరి, జూన్ 5: చంద్రగిరిలోని కోదండరామాలయం వద్ద బుధవారం బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ మేడసాని పురుషోత్తంనాయుడు ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, సుపరిపాలనతో ప్రజలు తిరిగి ఎన్డీఏకు పట్టం కట్టారన్నారు. కూటమితో వైసీపీ భూస్థాపితం అయిందన్నారు. బీజేపీ నాయకులు విరుపాక్షి నవీన్‌రెడ్డి, రాజేంద్రనాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల వివరాలకు
టీడీపీ నాయకుల డిమాండ్


ఉపాధి హామీ వివరాలు ఇవ్వాలని కోరుతున్న టీడీపీ నాయకులు

ఎర్రావారిపాలెం,జూన్ 5; మండలంలో ఉపాధి హామీ పథకం అములులో జరిగిన అవకతవకలకు సంబంధించి తమకు వివరాలు ఇవ్వాలని టీడీపీ నాయకులు బుధవారం ఏపీఓ ఆశాలతను నిలదీశారు. వైసీపీ ప్రభుత్వ హయంలో మండల స్థాయి నాయకులు ఉపాధి హామీ పనుల్లో భారీగా దోచుకున్నారని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి మహేష్ నాయుడు, యూత్ నాయకుడు నిరంజన్ రాయల్ పేర్కొన్నారు. గతంలో పలువురు సమాచార హక్కు చట్టం ద్వారా పనుల వివరాలు అడిగినా అధికారులు స్పందించలేదన్నారు. కొందరికి అరకొర వివరాలిచ్చి చేతులు దులుపుకొన్నారన్నారు. బహిరంగ సమావేశం నిర్వహించకుండా పలుమార్లు వాయిదా వేస్తున్నారన్నారు. గుట్టుగా ఆఫీసులోనే నిర్వహించేసినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. ఏపీఓ సరిగా స్పందించకపోవడంతో వీరు డ్వామా పీడీని కలిసి సమాచారం ఇవ్వాలని కోరారు.

జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ పదవికి రాజీనామా

శ్రీకాళహస్తి, జూన్ 5: పట్టణానికి చెందిన వైసీపీ నేత షేక్ సిరాజ్‌బాషా జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఆ లేఖను రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారికి బుధవారం పంపారు. ఈ సందర్భంగా సిరాజ్‌బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ఓడిపోయి ముఖ్యమంత్రిగా జగన్ వైదొలగడంతో తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

టీడీపీ నాయకులపై కత్తితో దాడికి యత్నం

వరదయ్యపాళెం, జూన్ 5: టీడీపీ నాయకులపై వైసీపీ కార్యకర్త కత్తితో దాడికి యత్నించిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు... సంతవేలూరులో టీడీపీ మండల మాజీ ప్రధాన కార్యదర్శి సుధాకర్ మంగళవారం కుటుంబసభ్యులతో కలిసి మాట్లాడుతుండగా అదే గ్రామానికి చెందిన బండార నరేష్ మద్యం మత్తులో దూషించాడు. సుధాకర్ కుమారుడు దీక్షిత్ జోక్యం చేసుకుని వారించాడు. అంతు చూస్తానంటూ కత్తితో దీక్షిత్‌పై దాడికి యత్నించాడు. స్థానికులు అడ్డుకుని నరేష్‌ను పోలీసులకు అప్పగించారు.

ఘనంగా పర్యావరణ దినోత్సవం


మొక్కలు నాటుతున్న అటవీశాఖ సిబ్బంది

మంగళం, జూన్ 5: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా అటవీశాఖ అధికారి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో రేణిగుంట మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. పర్యావరణ దినోత్సవ ఆవశ్యకతను అక్కడి వారికి వివరించారు. తిరుపతి-కరకంబాడీ మార్గంలో యశోద ఆధ్వర్యంలో బయోట్రీమ్ ప్రాంగణంలో మొక్కలు నాటారు.

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలంలో సి.గొల్లపల్లెలోని సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజశేఖర్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నానీకి సైకం అభినందన



తిరుపతి రూరల్, జూన్ 5: చంద్రగిరి నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా భారీ విజయం సాధించిన పులివర్తి నానీని ఏపీ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ సైకం జయచంద్రారెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛంతో అభినందించారు.

చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినానీని అభినందిస్తున్న సైకం జయచంద్రారెడ్డి

తిరుపతి రూరల్: చంద్రగిరి ఎమ్మెల్యేగా భారీ విజయం సాధించిన పులివర్తి నానీని బుధవారం తిరుపతి రూరల్ మండల తుమ్మలగుంట గ్రామ టీడీపీ అధ్యక్షుడు, వాణిజ్య విభాగ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బిరుదాల భాస్కర్‌రెడ్డి నేతృత్వంలో పలువురు కలిసి అభినందించారు. బిరుదాల కృష్ణారెడ్డి, బిరుదాల వేణుగోపాల్‌రెడ్డి, కేశవులుశెట్టి, డాక్టర్ సిద్దురాయల్, సిద్దారెడ్డి, మాజీ ఎంపీటీసీ సరస్వతి, పార్వతమ్మ, తులసీరామిరెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, రాధారాయల్, సుధీర్‌రెడ్డి, బాలాజి, మోహన్, విజయ, సురేష్, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.


నానీని సన్మానిస్తున్న బిరుదాల కృష్ణారెడ్డి, పార్లపల్లి భాను, తుమ్మలగుంట టీడీపీ నాయకులు

సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ బందోబస్తు

చంద్రగిరి, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ అనంతరం సమస్యాత్మక గ్రామాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. చంద్రగిరి, కూచువారిపల్లె, రామిరెడ్డిపల్లె, ముంగిలిపట్టు, మిట్టపాలెం, ఎ.రంగంపేట తదితర గ్రామాల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు.

భవిత పాఠశాలల్లో అడ్మిషన్లపై అవగాహన

పాకాల, జూన్ 5: ప్రత్యేక అవసరాల భవిత పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా సమగ్ర శిక్షా సహిత విద్య సమన్వయ కర్త చంద్రశేఖర్ రెడ్డి కోరారు. స్థానిక భవిత కేంద్రంలో నమోదు చేయించడానికి బుధవారం నిర్వహించిన సర్వేలో ఆయన పాల్గొన్నారు. ఇరంగారిపల్లె, శ్రీనివాసపురం, ముద్దలపల్లె, ఉప్పువంక, దేశిరెడ్డిపల్లె, గాంధీనగర్‌లలో పర్యటించారు. పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. భవిత పాఠశాలల్లో ఈ పిల్లలకు శిక్షణ ఇచ్చి సాధారణ స్థితికి తీసుకువస్తారని చెప్పారు. ఉచిత ఉపకరణాలు, వివిధ రకాల భత్యాలు పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా సమగ్ర శిక్ష ప్రణాళిక సమన్వయ కర్త రామచంద్రరెడ్డి, ఎంఈవో బాబ్జీ, భవిత కేంద్ర ఉపాధ్యాయులు మునికృష్ణారెడ్డి, సుందరి, సీఆర్పీలు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న చంద్రశేఖర్ రెడ్డి

తిరుపతి-పాకాల రెండో లైన్‌పై చిగురించిన ఆశలు

● నేడు సీఆర్‌ఎస్ పర్యటన

తిరుపతి,(ఆటోనగర్), జూన్ 5: తిరుపతి-పాకాల రైల్వే జంక్షన్ల మధ్య రెండో లైన్ ఏర్పాటు కొన్నేళ్ళుగా సర్వేలకే పరిమితమైందన్న విమర్శలు వున్నాయి. సికింద్రాబాద్ రైల్వే జోనల్ చీఫ్ రైల్వేసేఫ్టీ ఆఫీసర్ గురువారం పర్యటించనున్న నేపథ్యంలో తాజాగా ఆశలు చిగురిస్తున్నాయి. ఈ మార్గంలో పెరుగుతున్న రైళ్ళ దృష్ట్యా రెండో మార్గం అవసరమని అధికారులు,రాజకీయ నాయకులు గతంలోనే గుర్తించారు. అయినా 15 ఏళ్ళుగా ప్రతిపాదనలకు ఎలాంటి కదలిక రాలేదు. గతంలో పలుమార్లు అధికారులు సర్వే చేశారు. సర్వేల తర్వాత పురోగతి కనపడటం లేదు. ఈ మార్గంలో రైళ్ళ సంఖ్య పెరగడంతో తిరుపతి రైల్వే స్టేషన్‌పై ఒత్తిడి ఏర్పడుతోంది. ప్లాట్‌ఫారాలు ఖాళీ లేక పోవడంతో గంటల తరబడి పనపాకం,చంద్రగిరి రైల్వే స్టేషన్‌లలో రైళ్లు వేచి ఉండాల్సి వస్తోంది. డివిజన్, జోనల్ స్థాయి అధికారులకు తెలిసినా స్పందించడంలేదనే విమర్శలున్నాయి. కాట్పాడి-రేణిగుంట జంక్షన్ల మధ్య గూడ్స్ రైళ్ళు రాకపోకలు కూడా ఎక్కువే. దీంతో ఆ సమయంలో ప్రయాణికులు యాతన పడుతున్నారు. ధర్మవరం-పాకాల-కాట్పాడిల మధ్య రెండోలైనుపై రైల్వే బోర్డుకు ప్రతిపాదనలు వెళ్ళినట్లు సమాచారం. తిరుపతి-కాట్పాడిల మధ్య రోజువారీగా సుమారు 70 ఎక్స్‌ప్రెస్,ప్యాసింజర్ రైళ్ళు రాకపోకలు సాగిస్తాయి. ఈ విషయాన్ని రైల్వే బోర్డు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. దీంతోపాటే తిరుపతి-పాకాల మధ్య రెండోలైన్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని అధికారులు గుర్తించినట్లు తెలిసింది. ఈనేపథ్యంలో రేణిగుంట-కాట్పాడి రైలు మార్గాన్ని సికింద్రాబాద్ రైల్వే జోనల్ చీఫ్ రైల్వేసేఫ్టీ ఆఫీసర్ మాధవి గురువారం పరిశీలించనున్నారు. రేణిగుంట-కాట్పాడిల మధ్య విండో ఇన్‌స్పెక్షన్ చేయనున్నారు. అదేసమయంలో తిరుపతి-పాకాల రెండో లైన్ ఏర్పాటుపై చర్యలు తీసుకొనే అవకాశం వుందని తెలిసింది.

స్థానిక సంస్థల ఎన్నికలు మళ్లీ నిర్వహిస్తాం : టీడీపీ

తిరుపతి అర్బన్, జూన్ 5: ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, తిరుపతి టౌన్‌బ్యాంక్, నగర కార్పొరేషన్ ఎన్నికలను మళ్లీ నిర్వహిస్తామని టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్ అన్నారు. బుధవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ టీటీడీ సొమ్మును హవాలా మార్గంలో వైసీపీ ఖజానాకు తరలించడం దుర్మార్గమని ఆగ్రహించారు. దీని పర్యవసానంతోనే వైసీపీ చిత్తుగా ఓడిపోయిందని ఎద్దేవా చేశారు. సర్పంచుల వ్యవస్థను నిర్వీర్యం చేసి నిధులు పక్కదారి పట్టించారని ఆరోపించారు. కూటమి పాలనలో వాటిని దక్కించుకుని తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు శ్రీధర్‌వర్మ, సుబ్బరామయ్య, జగన్నాథం, గంధంబాబు, మనోహరాచారి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నరసింహయాదవ్

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.14 కోట్లు

తిరుమల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.14 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి, బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 76,291 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 28,495 మంది తలనీలాలు సమర్పించారు.

వార్ వన్‌సైడ్ : జనసేన



తిరుపతి అర్బన్, జూన్ 5: కనీవినీ ఎరుగని రీతిలో ఎలక్షన్ వార్ వన్ సైడ్ అయిందంటూ జనసేన తిరుపతి నియోజకవర్గ ఇంచార్జ్ కిరణ్‌రాయల్ ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జగనాసురుడనే రాక్షసుడి నుంచి రాష్ట్రాన్ని కాపాడేందుకు తమ అధినేత పవన్‌కల్యాణ్ టీడీపీ, బీజేపీని ఏకం చేసి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏర్పాటులో ప్రధాన పాత్ర పోషించారన్నారు. ఆరణి శ్రీనివాసులను భారీ మెజారిటీతో గెలిపించినందుకు నగర ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. పవన్‌కల్యాణ్‌ను అనరాని మాటలతో దూషించిన వైసీపీ నేతలు అసోం వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సుభాషిణి, సుమన్‌బాబు, మునస్వామి, హేమంత్, ఆది, సాయి, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర నిధులతో నగరాన్ని అభివృద్ధి చేస్తాం

టీడీపీ, జనసేన



తిరుపతి అర్బన్, జూన్ 5: ఎన్డీఏ ద్వారా కేంద్ర నిధులతో తిరుపతిని మరింత అభివృద్ధి చేస్తామని టీడీపీ, జనసేన పట్టణాధ్యక్షులు వట్టికుంట శంకర్‌నారాయణ, రాజారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల తరువాత కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులను మెజారిటీతో గెలిపించిన నగర ప్రజలకు కృతజ్ఞతలన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయమని, అందరి సమస్యలను పరిష్కరిస్తామని స్పష్టంచేశారు. ఓట్ల లెక్కింపులో భాగంగా తొలిగా తిరుమల బ్యాలెట్‌బాక్సునే లెక్కించారని, ఆ తరువాత రాష్ట్ర వ్యాప్తంగా కూటమి గెలుపునకు ఆ దేవదేవుడే శ్రీకారం చుట్టారన్నారు. వెంకన్న నిధులను వైసీపీ దోపిడీ చేసిందని, ఆ శాపమే ఓటమికి నాంది పలికిందన్నారు. టీడీపీ నాయకులు సత్తు మధుసూదన్‌యాదవ్, గోవిందాచారి, ఆలీ, నాగరాజు, దాము, నాగేశ్వరరావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

ధర్మారెడ్డి పాపాలే జగన్‌కు శాపాలు : బీజేపీ



తిరుపతి అర్బన్, జూన్ 5: టీటీడీ ఈవోగా ధర్మారెడ్డి చేసిన పాపాలే తాజా మాజీ సీఎం జగన్‌కు శాపాలుగా మారాయని బీజేపీ నాయకుడు నవీన్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీటీడీలో ఈవోగా ఉంటూ సకలశాఖలపై పెత్తనం చెలాయించిన ధర్మారెడ్డిని రిలీవ్ చేయకుండా సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఆయన విదేశాలకు వెళ్లకుండా అడ్డుకోవాలని కూటమి అధినాయకులకు విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశాల్లో ఎన్ని వేలకోట్ల రూపాయలు మంజూరు చేశారో వాటిపై, అజెండాలపై న్యాయ విచారణకు ఆదేశించాలని కోరారు. ధర్మారెడ్డి బ్యాంక్ అకౌంట్, స్థిర చరాస్తులను చట్టపరంగా సీజ్ చేయాలన్నారు. అక్రమ సంపాదనను శ్రీవారి ఖాతాలో జమ చేయాలని సూచించారు. ఆయన చేసిన అవినీతి వెలుగులోకి రావాలంటే టీటీడీ ఈవోగా నిజాయితీ కలిగిన సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్‌ను నియమించాలని కోరారు. టీటీడీ ప్రధాన గణాంకాధికారిపై విచారణకు ఆదేశిస్తే నమ్మలేని నిజాలు వెలుగులోకి వస్తాయన్నారు. హరిప్రసాద్, లోకేశ్, త్రిలోక్‌కుమార్, భాస్కర్, విగ్నేష్, జీవన్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీఆర్ బాండ్లు రాని బాధితులకు న్యాయం చేస్తాం

తిరుపతి అర్బన్, జూన్ 5: మాస్టర్‌ప్లాన్ రోడ్ల కారణంగా స్థలం కోల్పోయిన బాధితులకు టీడీఆర్ బాండ్లు అందజేసి న్యాయం చేస్తామని కాపునాడు అధ్యక్షుడు సరితా నాగరాజు తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాపు, ఒంటరి, తదితర బలిజ కులాల వారి మద్దతుతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. కాపు నాయకులు కృష్ణయ్య, శ్రీనివాసులు, సింగంశెట్టి సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లకు స్వల్పకాల శిక్షణ

తిరుపతి(ఆర్టీసీ), జూన్ 5: తిరుపతి గ్యారేజీలో బుధవారం ఆర్టీసీ డ్రైవర్లకు స్వల్పకాల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ప్రజా రవాణాధికారి చెంగల్‌రెడ్డి హాజరై డ్రైవర్లకు అవసరమైన మెలకువలను సూచించారు. ప్రమాద రహిత డ్రైవింగ్, ఘాట్‌లో సమయపాలన పాటించాలని, ప్రయాణికులతో గౌరవంగా వ్యవహరించి, సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. డ్రైవింగ్‌లో పేలవమైన ప్రదర్శన ఉన్న వారికి ప్రతి రోజు 45నిమిషాలపాటు ఈ శిక్షణ నిర్వహించాలని డిపో మేనేజర్ బాలాజీని ఆదేశించారు.

గుంటలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

తిరుపతి(నేరవిభాగం), జూన్ 5: రుయా ఆస్పత్రి వద్ద విద్యుత్ శాఖ సిబ్బంది తీసిన గుంటలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి... విద్యుత్ శాఖ సిబ్బంది అండర్ గ్రౌండు పనులు చేస్తున్నారు. అక్కడ ట్రాన్స్‌ఫార్మరు ఏర్పాటు కోసం పెద్ద గుంట తీశారు. చీకటిలో గుర్తు తెలియని వ్యక్తి గుంట ఉందనే విషయం తెలియక దానిలో పడి మృతి చెందాడు. ఇతడు భక్తుడా... లేకుంటే భిక్షగాడా అనేది విచారణలో తేలాల్సి ఉందని అలిపిరి సీఐ రామారావు చెప్పారు. పోస్టు మార్టం నిమిత్తం శవాన్ని రుయాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్యాన్సర్ నిర్మూలనకు కృషి చేయాలి


వైద్య అధ్యాపకులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్

తిరుపతి(వైద్యం), జూన్ 5: ప్రపంచంలోనే అతిపెద్ద వ్యాధి అయిన క్యాన్సర్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతీ ఒక్కరి కృషి అవసరమని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ రవిప్రభులు పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో డిస్ట్రిక్ సెకండరీ హెల్త్ స్పెషలిస్టులకు బుధవారం రుయాస్పత్రిలోని చిన్నపిల్లల విభాగంలో క్యాన్సర్‌పై మూడు రోజుల శిక్షణా తరగతులను ప్రారంభించారు. ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్‌లు మాట్లాడుతూ క్యాన్సర్‌కు చికిత్సకు రోజు రోజుకూ వస్తున్న అధునాతన పద్ధతులపై వైద్యులు తప్పక అవగాహన కలిగి ఉండాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, వైద్యాధికారులు రోజా రమణి, సునీత తదితరులు పాల్గొన్నారు.

పవన్, లోకేశ్‌లను కలిసిన ఆరణి శ్రీనివాసులు



తిరుపతి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన అనంతరం ఆరణి శ్రీనివాసులు విజయవాడకు వెళ్లారు. బుధవారం జనసేన అధినేత పవన్ కల్యాణ్ 20 మంది జనసేన ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా శ్రీవారి ప్రసాదాలు అందజేసి పవన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భారీ మెజార్టీతో గెలిచావని ఆరణిని భుజం తట్టి అభినందించారు. అదేవిధంగా టీడీపీ యువనేత నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబును కలిసినవారిలో ఆరణితో పాటు మదన్, జగన్, శివలు ఉన్నారు.

స్థానికులకు మంగళవారం శ్రీవారి దర్శనం కల్పించాలి

తిరుపతి అర్బన్, జూన్ 5: తిరుమల, తిరుపతిలో నివాసముంటున్న స్థానికులకు ప్రతి మంగళవారం శ్రీవారి దర్శనం కల్పించేలా కూటమి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చొరవ తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ తిరుపతిశాఖ అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు విజ్ఞప్తి చేశారు. ఎన్నో ఏళ్లుగా వాయిదా పడుతున్న ఈ అంశంపై ప్రభుత్వంతో చర్చించి ఆ నిర్ణయం శాశ్వతంగా అమలయ్యేలా కృషి చేయాలని కోరారు. కాలినడకదారిలో భక్తులకు భద్రత మరింత పెంచాలని, ఏర్పాట్లు మెరుగుపరచాలన్నారు.

ఎస్వీయూ రిజిస్ట్రార్ హుస్సేన్ రాజీనామా

తిరుపతి (విశ్వవిద్యాలయలు), జూన్ 5: ఎస్వీయూనివర్సిటీ రిజిస్ట్రార్ ఓఎండీ హుస్సేన్ తన పదవికి బుధవారం రాజీనామా చేశారు. యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ హుస్సేన్ వైసీపీ ప్రభుత్వ హయాంలో రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రంలో కూటమి గెలుపు నేపథ్యంలో రిజిస్ట్రార్ పదవికి ఆయన రాజీనామా చేశారు. ఇందుకు సంబంధించిన లేఖను యూనివర్సిటీ వీసీ శ్రీకాంత్ రెడ్డికి పంపారు. తన రాజీనామాను ఆమోదించాలని ప్రొఫెసర్ హుస్సేన్ కోరారు. ఈ రాజీనామాతో ఫిజిక్స్ విభాగంలో ప్రొఫెసర్‌గా హుస్సేన్ వ్యవహరించనున్నారు.

డాక్టరేట్ ప్రదానం


హర్షవర్ధన్ రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 5: ఎస్వీయూనివర్సిటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగ పరిశోధకులు కె.హర్షవర్ధన్‌రెడ్డి డాక్టరేట్ పొందారు. అనాలసిస్ ఆఫ్ మెడిఫైడ్ వాటర్ ఇండిసెస్ ఫర్ సర్ఫేస్ వాటర్ డిటెక్షన్ ఇన్ ల్యాండ్ సాట్-8 ఇమేజరీ అంశంపై ప్రొఫెసర్ దుర్గం గౌరీశంకర్‌రెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్లు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

పేదలకు అన్నదానం

తిరుపతి అర్బన్, జూన్ 5: లయన్స్‌క్లబ్ తిరుపతి గరుడాద్రి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల ఆవరణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చికిత్స పొందుతున్న బాధితుల సహాయకులకు దాదాపు 500మందికి భోజనం వితరణ చేశారు. ఆశాఖ అధ్యక్షులు మక్కిన భాస్కర్, చక్రపాణి, మధు, మురళి, శ్రీను, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరికాయల మొక్కు చెల్లించిన టీడీపీ కార్యకర్తలు



తిరుమల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి భారీ మెజార్టీ రావడంతో పాటు చంద్రగిరి అభ్యర్థి పులివర్తి నానీ గెలవడంతో ఆ పార్టీ కార్యకర్తలు బుధవారం తిరుమల శ్రీవారికి కొబ్బరికాయలు సమర్పించారు. తమ కోరిక నెరవేరడంతో స్వామికి మొక్కుచెల్లించడంలో భాగంగా 501 కొబ్బరికాయలు సమర్పించామని కార్యకర్తలు తెలిపారు. శ్రీనివాసులు, పాండు, దొరస్వామినాయుడు, నాగేశ్వరనాయుడు, పెంచల్య, సతీష్, దినేష్, సంతోష్, జగదీష్ ఉన్నారు.

భగవంతుడు ఇచ్చిన అదృష్టంగా భావిస్తున్నా

వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



తిరుమల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేగా గెలవడం భగవంతుడు ఇచ్చిన అదృష్టంగా భావిస్తున్నానని కోవూరు కూటమి ఎమ్మెల్యేగా గెలుపొందిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఆమె తన భర్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి దర్శించుకున్నారు. అనంతరం ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరూ బాగుండాలని, రాష్ట్ర అభివృద్ధి జరగాలని స్వామిని కోరుకున్నట్టు తెలిపారు.

కూటమి సంబరాలు


తీర్థకట్టవీధిలో సంబరాలు చేసుకుంటున్న కూటమి నాయకులు

తిరుపతి అర్బన్, జూన్ 5: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి భారీ మెజారిటీ విజయం, ప్రధాని మోదీ హ్యాట్రిక్ సాధించిన సందర్భంగా స్థానిక తీర్థకట్టవీధిలో బుధవారం మూడు పార్టీల నాయకులు సంబరాలు చేసుకున్నారు. అరుగోళం ప్రభాకర్‌రెడ్డి, సింగంశెట్టి సుబ్బరామయ్య, సురేంద్రరాజు, గుండాల గోపీనాథ్‌రెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యం, సరిత నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కేంద్ర కార్యాలయంలో సంబరాలు


విజయవాడ కార్యాలయంలో సంబరాలు చేసుకుంటున్న తిరుపతి మైనారిటీ విభాగం

తిరుపతి అర్బన్, జూన్ 5: టీడీపీ మైనారిటీ విభాగం తిరుపతి ఉపాధ్యక్షుడు హర్షద్ ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి(మైనారిటీ విభాగం) బాషా, కౌన్సిల్ మాజీ చైర్మన్ షరీఫ్‌లను మర్యాదపూర్వకంగా కలసి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. తిరుపతి మైనారిటీ విభాగం కార్యదర్శి నసరుద్దీన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం


ఎకో ఫ్రెండ్లీ సంచులను చూపుతున్న ముఖ్య అతిథులు

తిరుపతి(విద్య), జూన్ 5: తిరుపతి కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో స్థానిక రీజనల్ సైన్స్ సెంటర్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. గతనెల 31 నుంచి 5వ తేదీ వరకు పర్యావరణ వారోత్సవాలు జరిపారు. పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జూపార్క్ క్యూరేటర్ సి.సెల్వం, ఎస్వీయూ ఎనిరాన్‌మెంటల్ హెడ్ ప్రొఫెసర్ డి.దామోదరం, సైన్స్ సెంటర్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ, కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ ఇంజనీర్ నరేంద్రబాబు, ఇంజనీర్ అశోక్ కుమార్, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

భావితరాల కోసం పర్యావరణ రక్షణ

తిరుపతి(వైద్యం), జూన్ 5: పర్యావరణాన్ని మనం రక్షించినప్పుడే మనతో పాటు భావితరం కూడా సురక్షితంగా ఉంటుందని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఆయన బుధవారం కళాశాలలోని వైద్య విద్యార్థులకు పర్యావరణ రక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సామాజిక వైద్య విభాగాధిపతి రామాంజనేయులు, వైద్యులు సునీత, మూర్తి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గుడ్డసంచుల పంపిణీ



తిరుపతి (జీవకోన), జూన్ 5: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మార్గదర్శి సేవాసంస్థ ఆధ్వర్యంలో ప్లాస్టిక్‌ను వాడవద్దని కోరుతూ బుధవారం గుడ్డసంచులను పంపిణీ చేశారు. ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌లో వీటిని ఉచితంగా పంపిణీ చేశారు. రఫీ, విజయబాబు, రవికుమారి, రుద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలాంజనేయస్వామికి శాస్త్రోక్తంగా సింధూరార్చన



తిరుమల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆంజనేయస్వామి జన్మస్థలమైన ఆకాశగంగలో అంజనాదేవి సమేత బాలాంజనేయస్వామికి బుధవారం ఉదయం సింధూరార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం శ్రీరామచంద్రమూర్తికి, బాలాంజనేయ స్వామివారికి పుష్ప, తులసి అర్చన జరిగింది. టీటీడీ వైఖానస ఆగమ సలహాదారు మోహనరంగాచార్యులు సింధూరం ధరించిన వారికి ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, కీర్తి గడిస్తారని, సింధూరార్చన విశిష్టత, హనుమత్ వైభవం, అంజనాద్రి పర్వతం గురించి వివరించారు. అనంతరం బాలాంజనేయ స్వామికి, సుదర్శన చక్రానికి పంచామృత స్నపన తిరుమంజనాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహించారు. టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

లక్ష్మణప్రాణ ప్రదాత ఆంజనేయుడు

రామానుజ జీయర్‌స్వామి



తిరుమల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రామరావణ యుద్ధంలో లక్ష్మణ ప్రాణ ప్రదాత హనుమంతుడని తెలంగాణాలోని శంషాబాద్‌కు చెందిన అహోబిల రామానుజ జీయర్‌స్వామి ఉద్ఘాటించారు. హనుమత్ జయంతి ఉత్సవాలు బుధవారం తిరుమలలో ఘనంగా ముగిశాయి. నాదనీరాజనం, ఆకాశగంగ, జపాలి తీర్థంలో నిర్వహించిన ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా నాదనీరాజనం వేదికపై రామానుజ జీయర్‌స్వామి అనుగ్రహభాషణం చేస్తూ హనుమంతుడు ప్రతి కార్యాన్ని సున్నితంగా గమనించి ధర్మబద్ధంగా నిర్వహించేవాడని తెలిపారు. సుగ్రీవుడికి రాముడికి మైత్రి కల్పించింది హనుమంతుడేనన్నారు. హనుమంతుడు దేహబలం, బుద్ధి బలం కంటే సంస్కార బలం చాలా గొప్పదని నిరూపించాడన్నారు. ఆకాశగంగలో జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం అధ్యాపకులు ఆచార్య రాఘవాచార్యులు హనుమంతుడి జన్మవిశేషాలు తెలిపారు. జపాలిలో తిరుపతికి చెందిన భార్గవి బృందం హనుమాన్ చాలీసా పఠించారు. తర్వాత హరినాథ బృందం నృత్యరూపక ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మధ్యాహ్నం ప్రసన్నలక్ష్మీ బృందం హనుమాన్ చాలీసా, సాయంత్రం అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు మంజుల బృందం హరికథ గానం చేశారు.

టీడీపీ సంబరాలు


రేణుకా పరమేశ్వరి ఆలయంలో టీడీపీ నాయకుల సంబరాలు

తిరుపతి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్డీఏ అఖండ మెజారిటీతో గెలుపొందడం, తిరుపతిలో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు విజయం సాధించడంపై స్థానిక 37వ డివిజన్‌లోని రేణుకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం టీడీపీ నేతలు కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. అనంతరం చంద్రబాబు, పవన్ కటౌట్లకు పాలాభిషేకం చేసి, కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. క్లస్టర్ ఇంచార్జి దంపూరి భాస్కర్ యాదవ్, నాయకులు బీఎల్ సంజయ్, ఊకా విజయకుమార్, ఆరణి శ్రీనివాసులు అన్న కుమార్తె సునీత, ప్రశాంత్, సుబ్బారావు, బాలయ్యలు పాల్గొన్నారు.

ఎస్వీయూలో...


టపాసులు కాలుస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 5: ఎన్నికల్లో కూటమి విజయం పట్ల ఎస్వీయూనివర్సిటీలో టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం పరిపాలనా భవనం వద్ద భారీ కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు.టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి శేషాద్రి నాయుడు ఎన్నికల్లో గెలిచిన కూటమి అభ్యర్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు సప్తగిరిప్రసాద్, హరికృష్ణ యాదవ్, పత్తిపాటి వివేక్, రామ్మోహన్, రాజు, చిన్నా, అంజన్‌సింగ్, రాంబాబు, నరేంద్ర, మురళీమోహన్, జనసేన నాయకులు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో తిరుపతి విద్యార్థుల ప్రతిభ

తిరుపతి(విద్య), జూన్ 5: అండర్ గ్రాడ్యుయేట్ వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశానికిగాను జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ ప్రవేశపరీక్షలో తిరుపతి విద్యార్థులు ప్రతిభ చాటారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన నీట్ యూజీ - 2024 ప్రవేశ పరీక్ష ఫలితాలు మంగళవారం రాత్రి విడుదలయ్యాయి. తిరుపతికి చెందిన పలువురు విద్యార్థులు మంచి మార్కులు సాధించి జాతీయ స్థాయిలో ఉత్తమర్యాంకులు పొందారు.

శ్రీచైతన్య విద్యార్థుల విజయభేరి


శ్రీచైతన్య విద్యార్థులను అభినందిస్తున్న ఏజీఎం బీవీ ప్రసాద్

నీట్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించడంతోపాటు తిరుపతి జోన్ నుంచి అధిక సంఖ్యలో ర్యాంకులు కైవసం చేసుకున్నారని ఏజీఎం బీవీ ప్రసాద్, డీన్‌లు తెలిపారు. ప్రణీత 710, చరిష్మ 690, కీర్తనరెడ్డి 687, షాహిద్ 669, యశ్మిత 661, వెంకటకల్పన 650, తుల్య 640, సాత్విక 639, ప్రణవసాయి 637, జశ్వీర్ 636భవిత 627, హర్షవర్ధన్‌రెడ్డి 627, సింధు 623, వీర శ్రావణ్‌రెడ్డి 621, సోహ 620, భానుశ్రీ 619, దర్శిణి 617, దుర్గాప్రసాద్ 615, నందిని, ఉమాపతి 613, ప్రేమనారాయణ 611, కుషాల్ 608, నవ్యశ్రీ 607, సుప్రియ 607, వీక్షిత సాయి 607, యుగంధర్ 603, బిజు సర్వజిత్ 602 మార్కులు సాధించారు. అలాగే 600 మార్కులకుపైగా 35 మంది, 560 పైన 150 మంది, 500కుపైగా 250 మంది విద్యార్థులు మార్కులు సాధించారని చెప్పారు. పరీక్ష రాసిన వారిలో 90 శాతం మంది మెడికల్ సీట్లు పొందారని వెల్లడించారు. డీన్‌లు కేఎల్‌జీ ప్రసాద్, రామమోహన్‌రావు, కుమార్, భాస్కర్ తోపాటు ప్రిన్సిపాళ్లు విద్యార్థులను అభినందించారు.

నారాయణ విద్యార్థుల హవా


నారాయణ విద్యార్థి సాయి చరణ్

నీట్ పరీక్షలో తిరుపతి నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని డీజీఎం కొండలరావు తెలిపారు. సాయిచేతన్ రెడ్డి 720 మార్కులకుగాను 710 మార్కులు సాధించి జనరల్ కేటగిరీలో జాతీయ స్థాయిలో 701వ ర్యాంకు, ఈడబ్ల్యుఎస్ కేటగిరీలో 60వ ర్యాంకు సాధించారు. ఆకాంక్ష 681, తన్మయి 680, హర్షవర్ధన్ 677, సాయి సమిత్‌రెడ్డి 659, అక్షయ 654, నవ్య 627, మానస్ 626, మనస్విని 618, శ్రీలహరి 601, లేఖశ్రీ 615 సాధించారు. 600 మార్కులకుపైగా 13 మంది, 500కు పైగా 30 మంది ర్యాంకులు సాధించి ఎంబీబీఎస్‌లో వివిధ విభాగాల్లో సీట్లు సాధించబోతున్నారని ఆయన వెల్లడించారు.

డాక్టర్స్ మెడికల్ అకాడమీ విద్యార్థుల విజయం:


నీట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన డాక్టర్స్ మెడికల్ అకాడమీ విద్యార్థులు

నీట్ పరీక్షలో తిరుపతి డాక్టర్స్ మెడికల్ అకాడమీ విద్యార్థులు 80 మంది అత్యుత్తమ మార్కులతో విజయం సాధించారని కళాశాల చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ పార్థివ్‌రెడ్డి తెలిపారు. సాద్విక 661, బసవలింగ 658, దినేష్ 657, సాయి ధన్విత 655, లహరి 642, బాలాజీ 637, వంశీధర్‌రెడ్డి 631, జ్యోతివర్ధన్‌రెడ్డి, శ్రీదేవి 615, వజ్ర 610, షేక్ మీరజ్ 609, రోషిత 604, షనితా మాధురి, శ్రావణి 600 మార్కులు సాధించారు. 550 మార్కులకుపైగా 25 మంది, 500 మార్కులకుపైగా 50 మంది, 450 మార్కులకుపైగా 150 మంది ఫ్రీ మెడికల్ సీట్లు సాధించినట్టు వారు వివరించారు.

శ్రీధర్స్ అకాడమీ ప్రతిభ


శ్రీధర్స్ అకాడమీ విద్యార్థులు

తిరుపతి ఏఐఆర్ బైపాస్ రోడ్డులోని శ్రీధర్స్ అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయి నీట్ పరీక్షలో ప్రతిభ చాటారని విద్యాసంస్థ చైర్మన్ మద్దినేని శ్రీధర్ తెలిపారు. తోసిన సత్య 678, జీత్ 656, చైతన్యరెడ్డి 610, ఐశ్వర్య 609, వర్షిణి 581, వైష్ణవి 562, కార్తిరూప్‌రెడ్డి 557, ఛార్మిత 539, దుర్గ 529, గీతాంజలి 520, జ్ఞాన ప్రిస్కిల్ల 513, టబురెడ్డి 510 మార్కులు సాధించారని, 500 మార్కులకు పైబడి 14 మంది విద్యార్థులు సాధించారని చెప్పారు. విద్యార్థులను అధ్యాపక సిబ్బందిని అభినందించారు.


రాణించిన అశ్వమేధ విద్యార్థులు


అశ్వమేధ విద్యార్థులతో డైరెక్టర్లు, అధ్యాపక సిబ్బంది

స్థానిక ఏఐఆర్ బైపాస్ రోడ్డులోని అశ్వమేధ జూనియర్ కళాశాల విద్యార్థులు నీట్‌లో మంచి మార్కులు సాధించి రాణించారని విద్యాసంస్థ డైరెక్టర్లు అబ్దుల్ ఇస్రత్, టీఎం గోవర్ధన్ తెలిపారు. తమ విద్యార్థులు లక్ష్మీనరసింహారెడ్డి 669, శ్రావ్య 639, జోషిక 637, శ్రీహర్షిత 616, చైతన్యప్రియ 610 మార్కులు సాధించారని, మరో 30 మంది విద్యార్థులు 550 మార్కులకుపైన సాధించారని వెల్లడించారు. మొత్తం 152 మంది విద్యార్థుల్లో 55 మంది మెడిసిన్ సీట్లు పొందినట్టు చెప్పారు. ప్రిన్సిపాళ్లు సుమతి, రామయ్య, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులను డైరెక్టర్లు అభినందించారు.

టీడీపీకే పట్టం కట్టిన పట్టణవాసులు

గూడూరు అర్బన్, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల్లో గూడూరు నియోజకవర్గంలో గూడూరు పట్టణవాసులు టీడీపీకే పట్టం కట్టారు. నియోజకవర్గ పరిధిలో గూడూరు పట్టణంతోపాటు, గూడూరు మండలం, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాలున్నాయి. ఈ ఎన్నికల్లో గూడూరు పట్టణంలో టీడీపీకి అత్యధిక మెజార్టీ వచ్చింది. వాకాడు మండలంలో వైసీపీకి స్వల్ప మెజార్టీ మినహా అన్ని మండలాల్లో టీడీపీ ఆధిక్యతను ప్రదర్శించింది. గూడూరు పట్టణంలో 86 పోలింగ్ బూత్‌లు ఉండగా 54,037 మంది ఓటు వేశారు. ఇందులో టీడీపీకి 32,625 ఓట్లు, వైసీపీకి 18,334 ఓట్లు వచ్చాయి. దీంతో 14,291 ఓట్ల మెజార్టీ టీడీపీ దక్కించుకుంది. మూడింట రెండు వంతుల మెజార్టీ పట్టణవాసులే ఇచ్చారు. గూడూరు మండలంలో 30 పోలింగ్ బూత్‌లలో 20,896 ఓట్లకు గానూ టీడీపీ 10,498 ఓట్లు, వైసీపీకి 9,552 ఓట్లు పడ్డాయి. ఇక్కడ టీడీపీకి 946 ఓట్ల మెజార్టీ వచ్చింది. చిల్లకూరు మండలంలో 46 పోలింగ్ బూత్‌లలో 32,006 ఓట్లు ఉండగా టీడీపీకి 15,534, వైసీపీకి 14,509 ఓట్లు పడ్డాయి. ఇక్కడ టీడీపీకి 1,025 మెజార్టీ వచ్చింది. కోట మండలంలో 52 పోలింగ్ బూత్‌లలో పోలైన 33,763 ఓట్లలో టీడీపీకి 17,696, వైసీపీకి 14,265 ఓట్లు పోలవగా 3,431 ఓట్ల మెజార్టీని తెలుగుదేశం సాధించింది.



చిట్టమూరు మండలంలో 44 పోలింగ్ బూత్‌లలో 27,671మంది ఓటుహక్కును వినియోగించుకోగా టీడీపీకి 13,080 ఓట్లు రాగా వైసీపీకి 12,337 ఓట్లు పడ్డాయి. ఇక్కడ టీడీపీకి 743 ఓట్ల మెజార్టీ వచ్చింది. వాకాడు మండలంలో 36 పోలింగ్ బూత్‌లలో 25,113 మంది ఓటు హక్కును వినియోగించుకోగా టీడీపీకి 11,411 ఓట్లు రాగా వైసీపీకి 11,932 ఓట్లు రావడంతో వైసీపీకి 521 ఓట్ల మెజార్టీ సాధించింది. దీంతో నియోజకవర్గంలో అన్ని చోట్లా టీడీపీ మెజార్టీ సాధించగా ఒక్క వాకాడులో మాత్రం వైసీపీకి మెజార్టీ వచ్చింది.

ఎంపీ ఓట్లలో భారీగా క్రాస్ ఓటింగ్

గూడూరు: నియోజకవర్గంలో ఎంపీ ఓట్లలో ప్రజలు భారీగా క్రాస్ ఓటింగ్ వేసినట్లు ఫలితాల్లో స్పష్టమవుతుంది. ఎమ్మెల్యే ఓటు కూటమికి, ఎంపీ ఓటు వైసీపీకి వేసినట్లు వెల్లడైంది. కూటమి తరుపున గూడూరు నుంచి టీడీపీ అభ్యర్థిగా పాశం సునీల్‌కుమార్ పోస్టల్ బ్యాలెట్‌తో కలిపి 21,192 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈవీఎంలలో పాశంకు 1,00,844, వైసీపీ అభ్యర్థి మురళీధర్‌కు 80,929 ఓట్లు వచ్చాయి. అయితే ఎంపీకి క్రాస్ ఓటింగ్ జరిగినట్లు ఓటింగ్ సరళి ద్వారా అర్థమవుతోంది. తిరుపతి ఎంపీగా బీజేపీ నుంచి వరప్రసాదరావు ఓటమి పాలయ్యారు. గూడూరు నియోజకవర్గంలో వరప్రసాద్‌రావుకు 75,848 ఓట్లు వచ్చాయి. వైసీపీ ఎంపీ అభ్యర్థి గురుమూర్తికి 96,690 ఓట్లు వచ్చాయి. దీంతో గూడూరు నియోజకవర్గంలో వైసీపీ ఎంపీకి 20,842 ఓట్లు మెజార్టీ వచ్చింది. నియోజకవర్గంలో ఎక్కువమంది ఎంపీ ఓటు వైసీపీకి, ఎమ్మెల్యే ఓటు టీడీపీకి వేసినట్లు తెలుస్తోంది. గూడూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చింతామోహన్‌కు 9,424 ఓట్లు, నోటాకు 2,954 ఓట్లు వచ్చాయి. దీంతో కూటమి ఎంపీ అభ్యర్థి వరప్రసాద రావు ఓటమికి క్రాస్ ఓటింగ్ కారణమైనట్లు తెలుస్తోంది.

సహకరించిన వారికి రుణపడి ఉంటా: పాశం



సునీల్‌కుమార్‌ను సన్మానిస్తున్న చదలవాడ హరిబాబు తదితరులు

గూడూరు, జూన్ 5: తన గెలుపునకు కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక గ్రూప్‌థియేటర్లలో అధినేత చదలవాడ హరిబాబు ఆధ్వర్యంలో బలిజ అభ్యుదయ సేవాసంఘం నాయకులు పాశంను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తన విజయంలో బలిజ సంఘ నాయకులు కీలకపాత్ర పోషించారన్నారు. పార్టీకలకు అతీతంగా ప్రతిఒక్కరికీ అందుబాటులో ఉంటానన్నారు. కూటమి ద్వారా ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి చేకూరు తుందన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, వేమా భాస్కర్, పి.ప్రకాష్‌రావు, వెంకటేశ్వర్లు, చంద్రనీల్, వి.శివకుమార్, బాబు, పెళ్లి ఉదయ్‌భాస్కర్, పూర్ణచంద్రరావు, ఎం.వీ.రమణయ్య, వెంకటేశ్వర్లు, జి.విజయ తదితరులు పాల్గొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన నాయకులు సునీల్‌కుమార్‌ను సన్మానించి కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు.

రాక్షస పాలనను తరిమికొట్టారు: టీడీపీ

సూళ్లూరుపేట, జూన్ 5: ఐదేళ్ల రాక్షస పాలనను ప్రజలు ఓటురూపంలో తరిమికొట్టారని టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఎప్పుడు ప్రశాంతంగా ఉండే సూళ్లూరుపేటలో వైసీపీ పాలనలో గంజాయి పారిందన్నారు. నెలవల విజయశ్రీ గెలుపు నాయకుల సమష్టి కృషితోనే సాధ్యమైం దన్నారు. పార్టీ బీసీసెల్ నాయకుడు పెరుమాల్‌తో కలిసి చెంగాలమ్మ ఆల యం వద్ద 101 కొబ్బరికాయలు కొట్టి అమ్మవారికి మొక్కు లు చెల్లించుకున్నారు. వి.జనార్దన రెడ్డి, వి.మహేష్‌రెడ్డి, నాపా మునిరాజా, బి.విజయలక్ష్మి, బాలయ్య, శారద, వి.మురళిరెడ్డి తదితరులు ఉన్నారు.

అరాచక పాలనకు చరమగీతం

● నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం



నెలవలను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

నాయుడుపేట టౌన్, జూన్ 5: రాష్ట్రంలో గత 5 సంవత్సరాలుగా జరిగిన అరాచక పాలనకు ప్రజలు ఓటుతో చరమగీతం పాడారని మాజీ ఎంపీ, సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు నెలవల సుబ్రహ్మణ్యంను సన్మానించారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ... వైసీపీ పాలనతో రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీని అఖండ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆదవరం నాగూరయ్య, రాజశేఖర్‌రెడ్డి, నాగేంద్రరెడ్డి, కుబేరు మణి, దార్ల రాజేంద్ర, సుబ్బారావు, నారాయణ, రవి, చెంచయ్య తదితరులు ఉన్నారు.

టీడీపీ నాయకుల సంబరాలు



కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు

చిల్లకూరు, జూన్ 5: పెంచలకోన ఆలయ పాలక కమిటీ మాజీ ఛైర్మన్ తానంకి నానాజీ నివాసం వద్ద పాశం సునీల్ విజయం సాధించ డంపై టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి, కేక్ కట్‌చేసి విజయోత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నానాజీ మాట్లాడుతూ పాశం సునీల్‌కుమార్ గెలుపునకు కష్టపడి పనిచేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. వైసీపీ అచారకాలతో, అవినీతి అక్రమాల పాలనతో విసిగిపోయిన ప్రజలు కూటమికి పట్టం కట్టారన్నారు. ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, చిల్లకూరు పటాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, తానంకి సతీష్, బెల్లంకొండ మల్లికార్జున్, రాజేంద్ర, శివ, దినేష్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రాము, వినోద్, రవి, శ్రీనివాసులు, ప్రవీణ్, నవీన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

తీరంలో టీడీపీ సంబరాలు

కోట, జూన్ 5 : మండల పరిధిలోని సముద్రతీర ప్రాంతమైన కొత్తపట్నంలో బుధవారం టీడీపీ నేతలు, గ్రామస్తులు సంబరాలు చేసుకున్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పార్టీలు అత్యధిక సీట్లు సాధించినందుకు కొత్తపట్నంలో టీడీపీ నాయకులు బాణాసంచ పేల్చి సంబరాలు చేసుకున్నారు. అదే విధంగా కేక్‌ను కట్‌చేసి ఒకరిని ఒకరు తినిపించుకుంటూ నినాదాలు చేశారు. అనంతరం మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు తిరుమూరు మురళి, టీఎన్‌టీయూసీ నాయకులు చెంగల్‌రావు, అనూక్, కుమారి వెంకయ్యగౌడ్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడతా

● మాజీ ఎమ్మెల్యే కిలివేటి



వైసీపీ నాయకులతో కలిసి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి

నాయుడుపేట, జూన్ 5: ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుతానని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. నాయుడుపేట పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల తీర్పే తమకు శిరోధార్యమన్నారు. తనను ఎమ్మెల్యేగా, టీటీడీ బోర్డు సభ్యుడిగా ఆదరించిన నాయకులకు, కార్యకర్తల కు, అభిమానులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మున్సిపల్ ఛైర్ పర్సన్ కే.దీపిక, డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ టి.జనార్దన రెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మి, వైసీపీ మండల కన్వీనర్ టి.సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై కత్తితో దాడికి యత్నం

వరదయ్యపాళెం, జూన్ 5: ఎన్నికలల్లో వైసీపీ ఘోరంగా ఓటమిపాలవడంతో ఆ పార్టీ కార్యాకర్త టీడీపీ నాయకులపై కత్తితో దాడికి యత్నించిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు... మండలంలోని సంతవేలూరులో టీడీపీ మండల మాజీ ప్రధాన కార్యదర్శి సుధాకర్ మంగళవారం రాత్రి తన కుటుంబసభ్యులతో కలిసి తన ఇంటి ముందు మాట్లాడుతుండగా అదే గ్రామానికి చెందిన బండార నరేష్ మద్యం మత్తులో పరుషపదజాలంతో దూషించాడు. సుధాకర్ కుమారుడు దీక్షిత్ జోక్యం చేసుకుని వారించాడు. అంతు చూస్తానంటూ తన వెంట తెచ్చుకున్న కత్తితో దీక్షిత్‌పై దాడికి యత్నించాడు. స్థానికులు అడ్డుకుని నరేష్‌ను పోలీసులకు అప్పగించారు. కాగా, మంగళవారం రాత్రి ఫిర్యాదు చేయగా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితులు పేర్కొన్నారు. ఏఎస్‌ఐ షణ్ముగం వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

పరస్పర దాడి కేసు నమోదు

వరదయ్యపాళెం, జూన్ 5: మండలంలోని తొండంబట్టు పంచాయతీ నాగనందాపురంలో మంగళవారం రాత్రి టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకుంటుండగా పాతకక్షల నేపథ్యంలో వైసీపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ సందర్భంగా చెంగ్రాయులు, అతని కుమారులు రవిచంద్ర, వెంకటేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. తమపై సురేష్, మహేశ్వరి, చిరంజీవి దాడి చేశారని బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే చెంగ్రాయులు, రవిచంద్ర, వెంకటేష్ తమపై దాడి చేయడంతో గాయాల పాలైనట్లు సురేష్ కూడా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

సూళ్లూరుపేటలో భారీ వర్షం







సూళ్లూరుపేట జీఎన్‌టీ రోడ్డులో మార్కెట్ సెంటర్ వద్ద, ఆర్టీసీ బస్టాండు వద్ద జలమయమైన రోడ్డు - గూడూరు స్టేడియంలో నిలిచిన వర్షపునీరు

సూళ్లూరుపేట, జూన్ 5: సూళ్లూరుపేటలో బుధవారం ఉదయం ఉక్కపోతతో ప్రజలు అల్లాడారు. మధ్యాహ్నం ఒకసారిగా ఆకాశం మేఘావృతమై కారు మబ్బులు కమ్ముకొని ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు కురిసిన వర్షానికి రోడ్లన్ని జలమయమయ్యాయి. జీఎన్‌టీ రోడ్డులో కూరగాయల మార్కెట్ సెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు వర్షపు నీరు రోడ్ల పై నిలిచిపోవడంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు. రైల్వేస్టేషన్‌కు వెళ్లేదారిలో మోకాటి లోతు నీరు నిలబడడంతో అవస్థలు తప్పలేదు. మార్కెట్ వీధి, వినాయకుడి గుడి సెంటర్, బాపూజీ వీధి నుంచి జీఎన్‌టీ రోడ్డులో వాననీటితో కలిసి మురుగు పొంగి ప్రవహించింది.

గూడూరులో మోస్తరు వర్షం

గూడూరు: పట్టణంలో బుధవారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ ఉన్నా మధ్యాహ్నం 2.30గంటలకు ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులు వీచాయి. గంటపాటూ వర్షం కురిసింది. దీంతో స్థానిక ఏఎరెడ్డి ప్రభుత్వస్టేడియం, ఆర్టీసీ బస్టాండు రోడ్డు, ఐసీఎస్ రోడ్డు, త్యాగరాజవీధి, కుమ్మరవీధుల్లో రోడ్లపై వర్షపు నీరు నిల్వచేరింది. వర్షం కురవడంతో గ్రామీణప్రాంతాల్లోని నిమ్మ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బాలాయపల్లిలో చిరుజల్లులు

బాలాయపల్లి: రుతుపవనాల ప్రవేశంతో బుధవారం మండలంలో చిరుజల్లులు కురిశాయి. ఎండ తీవ్రతతో నిమ్మ చెట్లను కాపాడుకునేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. చెట్లు ఎండుముఖం పడుతున్న తరుణంలో చిరుజల్లులు కురవడంతో నిమ్మ రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

కోట: మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి పొద్దుపోయే వరకు జల్లులు పడుతూనే ఉన్నాయి. ఎండలతో సతమతమవుతూ వచ్చిన ప్రజలు ఈ వర్షంతో ఉపశమనం పొందారు. కోట, విద్యానగర్, వెంకన్నపాళెం, తిన్నెలపూడి, గూడలి, తదితర గ్రామాల్లో ఎడగారు వరి, వేరుశనగ సాగు చేస్తున్న రైతులకు ఊరటనిచ్చింది.

టీడీపీతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ: ఎమ్మెల్యే విజయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న విజయశ్రీ

సూళ్లూరుపేట, జూన్ 5: రాష్ట్రప్రభుత్వ దౌర్జన్యాలు, అరాచకాలతో ప్రజలు విసిగిపోయారని ప్రజాస్వామ్య పరిరక్షణ టీడీపీతోనే సాధ్యమని భావించి వైసీపీని నేలమట్టం చేసేలా ఎన్నికల్లో తీర్పునిచ్చారని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్ అన్నారు. బుధవారం గంగాప్రసాద్ నివాసంలో జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ... గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందన్నారు. రాష్ట్రం అధోగతి పాలవడం చూసి వైసీపీకి గుణపాఠం చెప్పాలనే ఎక్కడెక్కడో ఉన్న తెలుగువారు ఓటు వేసేందుకు పోటెత్తారన్నారు. రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతో సాధ్యమన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణ రెడ్డి మాట్లాడుతూ... డబుల్ ఇంజిన్ సర్కారుతో ఇసుక, మైనింగ్, ల్యాండ్ మాఫియాలకు పాల్పడ్డ వారిని వారిని వదిలిపెట్టేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి టి.సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షు, కార్యదర్శులు ఏ.రమేష్, ఏజీ కిషోర్, నాయకులు బొమ్మన్ శ్రీధర్, శ్రీనివాసులునాయుడు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఎన్నికై తొలిసారి సూళ్లూరుపేటకు విచ్చేసిన విజయశ్రీని సన్మానించి అభినందనలు తెలిపారు.

ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చా



నాయుడుపేట: వైద్యవృత్తిలో కొంతమందికి సేవ చేయగలుగుతాం... రాజకీయంగా అయితే అన్ని వర్గాలకు సేవ చేవవచ్చన్న ఉద్దేశంతోనే ప్రత్యక్ష రాజకీయాలలోకి వచ్చానని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. తన తండ్రి నెలవల సుబ్రహ్మణ్యం ఎమ్మెల్యేగా, ఎంపీగా, టీటీడీ బోర్డు సభ్యుడిగా అందించిన సేవలను ఆదర్శంగా తీసుకుని రాజకీయాల్లోకి వచ్చానని విజయశ్రీ అన్నారు. నాయుడుపేట పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నెలవల విజయశ్రీకి భారీ ఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. వారి సంక్షేమం, అభివృద్ధికి తోడ్పతానన్నారు. జి.సుధీర్‌రెడ్డి, ఏ.సుధీర్, ఎన్.సుబ్బారావు, దార్ల రాజేంద్ర, నారాయణ, రవి, కన్నెమ్మ, సుజాత, సూరి తదితరులు విజయశ్రీకి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

ముగిసిన హనుమజ్జయంతి ఉత్సవాలు



సూళ్లూరుపేట, జూన్ 5: పట్టణంలోని బాలాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాలు ముగిశాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు వీరాంజనేయస్వామి అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. ఉదయం స్వామివారిని పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి గ్రామోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆయా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకుడు లక్ష్మీనారాయణ, శ్రీధర్, కాకి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

గూడూరు అర్బన్, జూన్ 5: ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని వైద్య ఆరోగ్యశాఖ సబ్ యూనిట్ అధికారి రామరాజు అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో టవర్‌క్లాక్ సెంటర్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నీటిని పొదుపు వాడుకోవడంతోపాటూ మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో గోపి, ప్రవీణ, వాణి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నెల్‌క్యాస్ట్ కర్మాగారంలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో శ్రీరామ్, వెంకటేషన్, పళణిమురుగన్, శివకుమార్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు యువత నడుం బిగించాలి

వెంకటగిరి, జూన్ 5: పర్యావరణ పరిరక్షణకు యువత నడుం బిగించాలని వక్తలు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల లీగల్ కమిటీ ఆధ్వర్యంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు, కృషీవిజ్ఞాన కేంద్రంలో కేంద్ర అధిపతి డాక్టర్ బీజీ రాజులు మొక్కలు నాటారు.

కోట : పర్యావరణ పరిరక్షణలో ప్రతి మహిళా భాగస్వామ్యం కావాలని సీడీపీవో (స్త్రీశిశు సంక్షేమ అధికారి) మునికుమారి కోరారు. మండల పరిధిలోని తిన్నెలపూడి, లక్ష్మక్కకండ్రిగ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు జరిగాయి. ఆయా కార్యక్రమాలలో సీడీపీవో మునికుమారి పాల్గొని మొక్కలను చిన్నారులకు దత్తత ఇచ్చారు. ప్లాస్టిక్ వినియోగాన్ని కలసికట్టుగా నిషేధిస్తామన్నారు. ప్లాస్టిక్ వస్తువులలో తినుబండరాలు, భోజనాలు చేయరాదన్నారు. ఇందుకోసం ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త కీలకపాత్ర పోషించాలన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, జూన్ 5: పట్టణంలోని వీరభద్రస్వామి ఆలయంలో బుధవారం రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్ క్లబ్, ఆంధ్రమహిళా మండలి సహకారంతో దివ్యాంగులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రోహిణి, విష్ణువందన, జమునమ్మ, లక్ష్మి, అనిత, సుధీర్, శ్రీనివాసాచారి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బురదమయంగా బాలాయపల్లి ఆర్టీసీ బస్టాండు



బాలాయపల్లి, జూన్ 5: చిన్నపాటి వర్షానికే బాలాయపల్లి బస్టాండు బురదమయమవుతోంది. దీంతో బస్టాండులోకి బస్సులు రాకుండానే వెళ్లిపోతున్నాయి. ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డు పైకి పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. బస్టాండులో గోతులను పూడ్చాలని అధికారులను ప్రయాణికులు పలుమార్లు కోరినా పట్టించుకోలేదని వాపోతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి బస్టాండులోని గోతులను పూడ్చాల్సి ఉంది.

సునీల్‌కు నాయకుల శుభాకాంక్షలు

చిట్టమూరు, జూన్ 5: ఎమ్మెల్యేగా విజయం సాధించిన పాశం సునీల్‌కుమార్‌ను చిట్టమూరు మండల టీడీపీ కన్వీనర్ గణపర్తి కిషోర్ నాయుడు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు బుధవారం సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. చిట్టమూరు నుంచి భారీగా కార్యకర్తలు గూడూరుకు చేరుకుని ఆయనకు శుభాకాంక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వి.గోపాల్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి, ఎం.జనార్దన రెడ్డి, బి.హరికృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

అభివృద్ధి కోసం పట్టం కట్టారు

కోట, జూన్ 5: కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసి గ్రామాలను సస్యశ్యామలంగా మార్చిన పాశం సునీల్‌కుమార్‌కు నియోజకవర్గ ప్ర జలు రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించి చరిత్ర తిరగరాశారని చిట్టమూరు మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు ఉద్దూరు రాజగోపాల్ అన్నారు. ఆయన చేసిన సేవలకు నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యే పదవిని అత్యధిక మెజార్టీతో గెలిపించి బహుమతిగా ఇచ్చారన్నారు. ఆయన ఆధ్వర్యంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమం జరగాలని రాజగోపాల్ ఆశాభావం వ్యక్తం చేశారు.

అనారోగ్యంతో క్యాన్సర్ రోగి ఆత్మహత్య

శ్రీకాళహస్తి, జూన్ 5: అనారోగ్యంతో తిరువీధుల శ్రీనివాసులు(48) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వటౌన్ పోలీసుల కథనం మేరకు... శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన శ్రీనివాసులు అవివాహితుడు. ప్రైవేటు పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. పదేళ్ల క్రితం నోటి క్యాన్సర్ వ్యాధి బారిన పడ్డాడు. తీవ్ర అనారోగ్యంతో మనస్తాపం చెంది ఇంటి వద్ద బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తించిన బంధువులు, కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

ప్రతి ఒక్కరి రుణం తీర్చుకుంటా: విజయశ్రీ



ఎమ్మెల్యే నెలవల విజయశ్రీని సత్కరిస్తున్న పేరం సోదరులు

పెళ్లకూరు, జూన్ 5: తనపై నమ్మకం ఉంచి రాత్రీ పగలు కష్టపడి తన గెలుపునకు సహకరించిన ప్రతి ఒక్కరి రుణం తీర్చుకుంటానని సూళ్లూరుపేట టీడీపీ ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. బుధవారం ఆమె తిరుపతి నుంచి నాయుడుపేటకు వస్తుండగా మార్గ మధ్యంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సత్కరించారు. పెళ్లకూరు వద్దకు రాగానే టీడీపీ నాయకులు పేరం రమేష్ నాయుడు, మధుసూదన నాయుడు ఆధ్వర్యంలో గుమ్మడికాయలతో దిష్టి తీశారు. తన తండ్రి మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం బాటలో నడుస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. వి.శేఖర్‌నాయుడు, కృష్ణమ నాయుడు, సిద్దులయ్యనాయుడు, హరినాయుడు, వెంకటతేజ, సందీప్, యుగంధర్, పరశురాం, కన్నలి వాసు, సుబ్రహ్మణ్యం రెడ్డి, రాధానాయుడు, హరినాయుడు తదితరులు ఉన్నారు.

టీడీపీ ఎమ్మెల్యేలను కలసిన కల్యాణ్‌రెడ్డి



కోటంరెడ్డితో కల్యాణ్‌రెడ్డి

పెళ్లకూరు, జూన్ 5: కేఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, టీడీపీ యువనేత వేలూరు కల్యాణ్‌రెడ్డి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

ఏటీఎం కార్డు మార్చి రూ.20వేల చేతివాటం

నాయుడుపేట టౌన్, జూన్ 5 : పట్టణంలోని గడియారం సెంటర్ సమీపంలో ఓ ఏటీఎంలో కార్డు మార్చి రూ.20వేలు అపహరించినట్లు బాధితురాలు అనురాధ తెలిపారు. పిచ్చిరెడ్డితోపులో నివాసం ఉంటున్న అనురాధ నగదును డ్రా చేసేందుకు ఏటీఎంకు చేరుకుంది. అదే సమయంలో అక్కడ ఉన్న గుర్తుతెలియని వ్యక్తికి నగదు తీసి ఇవ్వమని కోరింది. తన పిన్ నెంబరు తెలిపింది. నగదు రాలేదంటూ సదరు వ్యక్తి ఆమెకు చెప్పారు. అలాగే తన ఏటీఎం కార్డును ఆమెకు ఇచ్చి అనురాధ కార్డును తీసుకెళ్లిపోయాడు. కొంత సమయం తరువాత రూ.20వేల నగదు తన ఖాతా నుంచి డ్రా అయినట్టు అనురాధ మొబైల్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో మోసపోయానని గ్రహించిన ఆమె స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

పిడుగుపాటుకు యువకుడి మృతి



చెందు (ఫైల్ ఫొటో)

దొరవారిసత్రం, జూన్ 5: మండలంలోని తొగరాముడి పొలాల్లో మంగళవారం సాయంత్రం పిగుడుపాటుకు గురై ఆ గ్రామ గిరిజన కాలనీకి చెందిన పెప్పల చెందు(17) మృతి చెందాడు. గ్రామానికి సమీపంలో గేదలను మేపుతుండగా వానతోపాటు ఉరుములు, మెరుపులు పడ్డాయి. ఆ సమయంలో పిడుగుపడటంతో షాక్‌కు గురయ్యాడు. గేదెలను తోలుకుని వెళ్లిన చెందు రాత్రి 10 గంటలైనా ఇంటికి చేరకపోవడంతో కుటుంబీకులు గాలించారు. పొలాల్లో నిశ్చలంగా పడిఉన్న చెందును సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్టు పేర్కొన్నారు. ఈక్రమంలో పోస్టుమార్టం నిర్వహించి మృత దేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. సెల్‌ఫోన్ వినియోగించడం వల్లే పిడుగుపాటుకు గురై మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

ఇంటి ముందు టపాకాయలు పేల్చాడంటూ...

టీడీపీ కార్యకర్తపై వైసీపీ కార్యకర్త దాడి

ఓజిలి, జూన్ 5: మండలంలోని సగుటూరు వడ్డిపాళెంలో మంగళవారం రాత్రి టీడీపీ కార్యకర్తపై వైసీపీ కార్యకర్త దాడి చేశాడు. ఓజిలి ఎస్‌ఐ రవిబాబు కథనం మేరకు... గ్రామానికి చెందిన జి.శీనయ్య తన ఇంటి ముందు టపాకాయలు కాల్చుకుంటున్నాడు. ఇదే సమయంలో ఆయన ఇంటికి ఎదురుగా ఉన్న టి.జయరామయ్య అభ్యంతరం వ్యక్తం చేశాడు. ఈక్రమంలో వారి మధ్య మాటామాటా పెరిగి దాడికి దిగారు. జయరామయ్యకు మద్దతుగా మరికొందరు చేరి శీనయ్యపై కర్రలతో దాడి చేయగా తలకు తీవ్ర గాయమైంది. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. శ్రీనయ్య నెల్లూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

బూదనంలో ఘర్షణ: ఆరుగురిపై కేసు నమోదు

చిల్లకూరు, జూన్ 5: మండలంలోని బూదనం గ్రామంలో బుధవారం పలువురి మధ్య వివాదం ఘర్షణకు దారితీసింది. పోలీసుల కథనం మేరకు... గ్రామానికి చెందిన ప్రవీణ్, సుబ్బయ్య మంగళవారం రాత్రి మద్యం తాగి వెంకటేశ్వర్లు, రాజా, శ్రీనివాసులు, ఏడుకొండలు, కె.వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాసులుతో వాగ్వాదానికి దిగారు. బుధవారం సుబ్బయ్య, ప్రవీణ్‌తో ఆరుగురు గొడవకు దిగారు. అంతేకాకుండా ప్రవీణ్‌పై దాడి చేశారు. దీనిపై ప్రవీణ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆరుగురిపై కేసు నమోదు చేశారు.

విద్యుదాఘుతంతో రెండు మేకల మృతి

వరదయ్యపాళెం, జూన్ 5: మండలంలోని సాధనవారి పాళెంలో విద్యుదాఘాతంతో రెండు మేకలు మృతిచెందాయి. గ్రామంలో ఓ విద్యుత్ స్తంభం కూలడానికి సిద్ధంగా ఉండటమే కాకుండా విద్యుదాఘాతం జరుగుతోందని గత యేడాది గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాలకులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని బాధితుడు చెంగయ్య ఆగ్రహం వ్యక్తం చేశాడు. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా బుధవారం రెండు మేకలు విద్యుదాఘాతంతో మృతిచెందినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. వాటిని కాపాడేందుకు అక్కడే ఉన్న ఓ యువకుడు యత్నించగా పలువురు హెచ్చరించడంతో ప్రాణాపాయం తప్పిందని తెలిపాడు.

పర్యావరణాన్ని పరిరక్షించు కుందాం

గూడూరు అర్బన్, జూన్ 5: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని న్యాయవాది కోటేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక కోర్టు ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలను నాటి సంరక్షిస్తే పర్యావరణాన్ని కాపాడు కోవచ్చ న్నారు. కృష్ణయ్య, ప్రసాద్, బాలప్రదీప్, ఈశ్వరయ్య, మెహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో బొజ్జల సుధీర్‌రెడ్డి



దక్షిణామూర్తి సన్నిధి వద్ద కుటుంబ సభ్యులతో సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూన్ 5: శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా గెలుపొందిన బొజ్జల సుదీర్ రెడ్డి కుటుంబ సమేతంగా బుధవారం ముక్కంటి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈవో నాగేశ్వరరావు స్వాగతం పలికారు. దక్షిణ గోపురం వద్ద సుదీర్ రెడ్డి దంపతులు గోపూజ చేశాక స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అన్నదాన మండపాన్ని పరిశీలించిన ఆయన భక్తులతో మాట్లాడి భోజన నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం పరిపాలన భవనం చేరుకుని పలు అంశాలపై ఈవో నాగేశ్వరరావుతో చర్చించారు. సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ, సతీమణి రిషితారెడ్డి, టీడీపీ నాయకులు మునిరాజానాయుడు, విజయకుమార్, కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సుధీర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ వైసీపీ దోపిడీ చేయడంతో పాటు ప్రజలను భయపెడుతూ పాలన సాగించిందన్నారు. ఎన్డీయే కూటమి అలాంటి పరిస్థితులను ఎప్పుడూ సాగనివ్వదన్నారు. శ్రీకాళహస్తిలో అరాచక పాలనకు ప్రజలు అంతం పలికి స్నేహపూర్వకమైన ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని చెప్పారు. ముక్కంటి ఆలయంలో దళారీ వ్యవస్థను రూపుమాపడంతో పాటు రాహుకేతు పూజల్లో బలవంతంగా దక్షిణ తీసుకునేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అమ్మవారి గర్భాలయ గోడలకు, ఆలయం లోపల ఉన్న స్తంభాలకు స్వర్ణ తాపడం త్వరలో చేయిస్తామన్నారు. అలాగే ముక్కంటి ఆలయంలోని అన్ని విభాగాలను గాడిన పెట్టి జవాబుదారీగా పనిచేసేలా చస్తామన్నారు.

టీడీపీ నేతల అభినందన



సుధీర్‌రెడ్డిని అభినందిస్తున్న అన్నాస్వామిపల్లె గ్రామ టీడీపీ నేతలు

తిరుపతి రూరల్, జూన్ 5: శ్రీకాళహస్తి నియోజకవర్గ కూటమిపార్టీ ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో ఎన్నికైన బొజ్జల సుధీర్‌రెడ్డిని రేణిగుంట మండల అన్నాస్వామిపల్లె గ్రామ టీడీపీ నేతలు బుధవారం మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు. నాయకులు భాస్కర్‌రెడ్డి, చిన్నప్పరెడ్డి, మాధవరెడ్డి, మునిశంకర్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, సురేష్, గిరిధర్, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

సుధీర్‌రెడ్డి గెలుపు సంతోషకరం



శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద పల్లమాల సుధాకర్

శ్రీకాళహస్తి, జూన్ 5: శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా బొజ్జల సుధీర్‌రెడ్డి గెలుపొందడం సంతోషకరమని మొగలిరేకుల సీరియల్ నిర్మాత పల్లమాల సుధాకర్ అన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని బుధవారం ఆయన దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సుధీర్‌రెడ్డి గెలుపు కోసం తాను విస్తృతంగా ప్రచారం చేశానని, ఆయన భారీ మెజార్టీతో గెలుపొందడంతో మొక్కులు చెల్లించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పల్లమాల శశాంక్, పూల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతలకు శ్రీసిటీ ఎండీ శుభాకాంక్షలు

శ్రీసిటీ, జూన్ 5: రాష్ట్ర అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఘన విజయం సాధించిన టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. కూటమి నేతల నాయకత్వంపై ప్రజల విశ్వానికి ఇది ప్రతీకగా ఆయన పేర్కొన్నారు. వరుసగా మూడవసారి కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న బీజేపీ, దాని భాగస్వామ్య పార్టీలకు ఆయన అభినందనలు తెలిపారు. దేశ ప్రజల ఆకాంక్షలు, విశ్వాసాలకు అనుగుణంగా ఎన్డీయే స్థిరమైన పాలనకు, నిబద్ధతకు ఇది సాక్ష్యంగా ఆయన పేర్కొన్నారు. ఎన్డీయే కూటమిలో ప్రస్తుతం టీడీపీ, జనసేన కీలక భాగస్వామ్యం వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో మరింత ఆర్థికాభివృద్ధికి అవకాశం ఉందన్నారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

వైభవంగా అమావాస్య ఉత్సవం



శ్రీకాళహస్తి, జూన్ 5: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం అమావాస్య ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామి అమ్మవార్లను చప్పరాలపై అధిష్ఠించి పురవిహారం చేశారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామిఅమ్మవార్లను దర్శించుకుని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో నాగేశ్వరరావు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కు చెల్లింపు

శ్రీకాళహస్తి, జూన్ 5: శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా బొజ్జల సుధీర్‌రెడ్డి గెలిస్తే మోకాళ్లపై కనకాచలం కొండపై వెలసిన కనకదుర్గమ్మకు పూజలు చేస్తానని టీడీపీ పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్ మొక్కుకున్నాడు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో సుధీర్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించారు. బుధవారం వజ్రం కిషోర్ కనకాచలంపైకి మోకాళ్లపై వెళ్లి కనకదుర్గమ్మకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ బొజ్జల సుధీర్‌రెడ్డి నాయకత్వంతో పట్టణంలో మరింత అభివృద్ధి జరగాలని... ఆయనపై అమ్మవారి కృప ఎప్పుడు ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

కేవీబీపురంలో మోస్తరు వర్షం

కేవీబీపురం, జూన్ 5: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. పెరిందేశం, రాగిగుంట, ఆదవరం, వేమలపూడి, కేవీబీపురం, రాయపేడుతో పాటు మరికొన్ని గ్రామాల్లో వర్షం పడటంతో సజ్జ విత్తనాలు వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

సుధీర్‌రెడ్డికి అభినందనలు

రేణిగుంట, జూన్ 5: శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన బొజ్జల సుధీర్‌రెడ్డిని టీడీపీ నాయకులు అభినందనలతో ముంచెత్తారు. బుధవారం ఉదయం నడివీధి గంగమ్మ వద్ద 101 టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. అనంతరం టీడీపీ నాయకులు ఊరందూరుకు చేరుకుని సుధీర్‌రెడ్డిని అభినందించారు.

జనసేన నేత మొక్కు చెల్లింపు



కొబ్బరికాయలు కొడుతున్న జనసేన నేతలు

శ్రీకాళహస్తి, జూన్ 5: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించడంతో బుధవారం జనసేన నాయకులు శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద 101 కొబ్బరికాయలను కొట్టారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కొట్టే సాయి, దండి రాఘవయ్య, రామిశెట్టి కిరణ్, గోపి, కుమార్, మాధవమహేష్, ప్రసాద్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



శ్రీకాళహస్తిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రమాణం చేస్తున్న విద్యార్థులు - మొక్కలు నాటుతున్న అటవీశాఖ రేంజ్ అధికారి, శ్రీసిటీ అధికారులు

శ్రీసిటీ, జూన్ 5: శ్రీసిటీలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీసిటీ ఉద్యానవన విభాగ అధికారి మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా విచ్చేసిన సత్యవేడు అటవీశాఖ రేంజ్ అధికారి జి.జయప్రసాద్‌రావు, చెన్నైకి చెందిన ప్రముఖ ఎపికల్చరిస్ట్ ప్రొఫెసర్ విలియం జేమ్స్ స్థానిక నర్సరీ ఆవరణలో తలపెట్టిన గుమ్మడి మొక్కలు నాటారు. ఫారెస్టు రేంజ్ అధికారి మాట్లాడుతూ శ్రీసిటీ చేపట్టిన హరితహిత చర్యలకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు. పర్యావరణ పరాగ సంపర్కంలో తేనెటీగల కీలక పాత్ర గురించి ప్రొఫెసర్ విలియం జేమ్స్ వివరించారు. తేనెటీగల నివాసాలను సంరక్షించడం, రసాయనిక వినియోగాన్ని తగ్గించడం నీటి వనరుల లభ్యత, స్థానిక మొక్కల జీవితాన్ని ప్రోత్సహించడం వంటి పలు పర్యావరణ అనుకూల పద్ధతులను ఆయన సూచించారు.

శ్రీకాళహస్తి: మండలంలోని బీవీపురంలో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ప్రగతి సంస్థసిబ్బంది ప్రభాకర్, రామచంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదే విధంగా పట్టణంలోని ఉపకారాగారంలో మొక్కలు నాటారు. ఖైదీలకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. న్యాయవాదులు అరుణ్, గరికపాటి రమేష్‌బాబు, శ్రీరామ్, గుమ్మళ్ల రాజేశ్వరరావు పాల్గొన్నారు. ఇక పట్టణంలోని బాబుఅగ్రహారం పురపాలకసంఘ ఉన్నత పాఠశాల, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో స్కౌట్ విద్యార్థులు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో రమేష్‌బాబు, సావిత్రి, ఎస్కే అజారుద్దీన్, సులోచనదేవి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: పర్యావరణాన్ని పరిరక్షించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, నాదెండ్ల మురళి తెలిపారు. మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు.

రేణిగుంట: సీఆర్ఎస్ రైల్వే ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ నరసింహ నిశాంత్, ఆస్పత్రి సిబ్బంది హేమలత, ఉమాపతి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: మండలంలోని పల్లం, చిందేపల్లె, పోతుమానుగుంట, చెన్నంపల్లె, కుక్కలగుంట, శివగిరి కాలనీలో క్రైసంస్థ ఆధ్వర్యంలో ప్రగతిసంస్థ చిన్నారులకు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థిరమైన వినియోగంపై అవగాహన కల్పించారు. విద్యార్థుల చేత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్లు శిరీష, సుభాష్, ఆర్గనైజర్లు వెంకటేష్, సురేష్, సుమలత, రాజేశ్వరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంప్రదాయాలు పాటించని అధికారులపై చర్యలు తీసుకోండి

శ్రీకాళహస్తి, జూన్ 5: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలను పాటించకుండా మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి దర్శనం కల్పించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిడాక్టర్ ఎం.ఉమేష్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు, గత ఐదు సంవత్సరాలుగా ఎమ్మెల్యే వారి అనుచరులు ఆలయంలో చేసిన అక్రమ వ్యవహారాలను వెలుగులోకి తీసుకువచ్చి కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బీమాల భాస్కర్ ముదిరాజ్, మునిరాజాయాదవ్, చిల్లకూరు మణి, శివ, నాగరాజు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల సమష్టి కృషితోనే ఆదిమూలం గెలుపు



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్ నాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 5: కార్యకర్తల సమష్టి కృషితోనే సత్యవేడు టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలం గెలుపొందారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు అన్నారు. బుచ్చినాయుడుకండ్రిగలోని పార్టీ కార్యాలయంలో విజయోత్సవ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిమూలం గెలుపు కోసం పనిచేసిన టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. మండలం నుంచి 1000 మెజారిటీ రావడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కన్నయ్య నాయుడు, తిరుపతి పార్లమెంట్ కార్యదర్శి సముద్రాల సుధాకర్ నాయుడు, నాయకులు సుందరయ్య, వెంకటాచలం, మునిరాజా, శ్రీనివాసులు, మధునాయుడు, పెంచలయ్య, భాస్కర్ యాదవ్, శేషయ్య, నరసింహులు, వీరరాఘవులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల సంబరాలు

కేవీబీపురం, జూన్ 5: మండలంలోని సదాశివపురంలో టీడీపీ మండలాధ్యక్షుడు రామాంజులు నాయుడు, తిరుపతి పార్లమెంటు తెలుగు రైతు అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి, జయరామిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. నిరంకుశ పాలనతో విసిగివేసిపోయిన ప్రజలు ఎన్డీఏ కూటమికి పట్టకట్టారని అన్నారు. కార్యక్రమంలో లక్ష్మీపతిరాజు, సురేష్‌రెడ్డి, నాగరాజురెడ్డి, చెంగారెడ్డి, మణి, సర్పంచులు బాలాజీ, చలపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇది ప్రజా విజయం: ఆదిమూలం



ఆదిమూలాన్ని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

సత్యవేడు, జూన్ 5: సత్యవేడు నియోజకవర్గ ప్రజలకు, పెత్తందారుల అహంకారానికి మధ్య జరిగిన ఎన్నికల్లో అంతిమంగా ప్రజలే గెలిచారని ఆదిమూలం పేర్కొన్నారు. బుధవారం ఆయనను నియోజకవర్గంలోని పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు కలసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశం మొత్తం ఏపీ వైపు చూసేలా ప్రజలు అద్భుతమైన తీర్పునిచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ పదవికి రాజీనామా

శ్రీకాళహస్తి, జూన్ 5: పట్టణానికి చెందిన వైసీపీ నేత షేక్ సిరాజ్‌బాషా జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఆ లేఖను రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారికి బుధవారం పంపారు. ఈ సందర్భంగా సిరాజ్ బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ఓడిపోయి ముఖ్యమంత్రిగా జగన్ వైదొలగడంతో తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి, జూన్ 5: శ్రీకాళహస్తి మండలం ఓబులాయపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పి.లక్ష్మణ్ 2023-24 విద్యాసంవత్సరంలో ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయుడు సాధికాబాషా విద్యార్థిని అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని దీపిక ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో అర్హత సాధించి ఉపకార వేతనానికి ఎంపికైనట్లు ఉపాధ్యాయులు బుధవారం తెలిపారు. ఈ విద్యార్థికి ఏడాదికి రూ.12వేల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు ఉపకార వేతనం అందుతుందన్నారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఏర్పేడు, జూన్ 5: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుచానూరు 6నుంచి 12వ తరగతి విద్యార్థులకు జడ్పీ ఉన్నత పాఠశాలలో పర్యావరణ సంరక్షణపై జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. ఏర్పేడు మండలానికి చెందిన పలువురు విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. పోస్టల్ ప్రజంటేషన్‌లో 9వ తరగతి విద్యార్థి విద్య జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. వ్యాసరచన పోటీల్లో 10వ తరగతి విద్యార్థి సుప్రజ తృతీయస్థానంలో నిలిచింది. వీరికి డీఈవో శేఖర్ బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

పుత్తూరు వార్తలు

నగరిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

గాలి భానుప్రకాష్



మీడియాతో మాట్లాడుతున్న భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జూన్ 5: నగరి నియోజకవర్గ ఓటరు దేవుళ్ల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యేగా ఎన్నికైన గాలి భానుప్రకాష్ స్పష్టం చేశారు. బుధవారం కార్యకర్తలను కలుసుకునేందుకు పుత్తూరుకు వచ్చిన ఆయన కేఎన్ రోడ్డు సర్కిల్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ ఐదేళ్ల పాలనలో అవినీతి, దౌర్జన్యాలు, హింసతో ప్రజలకు ప్రత్యక్ష నరకం చూపిన వైసీపీకి తమ ఓటుతో చెంపపెట్టు వంటి తీర్పునిచ్చారని పేర్కొన్నారు. ప్రజలు ఎంత ఇబ్బందిపడి ఉంటే వైసీపీకి కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా ఫలితాలు వచ్చాయో అర్థం అవుతోందన్నారు. తనపట్ల నగరి నియోజకవర్గ ప్రజలు చూపిన ఆదరాభిమానాలు వెలకట్టలేనివన్నారు. చంద్రబాబునాయుడు సారథ్యంలో నగరి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని చెప్పారు. ప్రతి ఒక్కరికీ అండగా ఉంటూ ఆదుకుంటానన్నారు. తరువాత కల్యాణపురం వద్ద ఉన్న టీడీపీ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు ఆధ్వర్యంలో కార్యకర్తలను కలుసుకుని వారి అభినందనలు అందుకున్నారు. మాజీ ఎంపీపీ డీఎస్ ఏలుమలై, ఎస్ఎస్ ధనపాల్, షణ్ముగరెడ్డి, బీఆర్ యుగంధర్, మాధవనాయుడు, కుప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

నాడు అనుగ్రహం.. నేడు ఆగ్రహం

- రోజా ఓటమిపై జనంలో చర్చ
- స్థానికేతరులైనప్పటికీ రెండుసార్లు ఆదరించిన నగరి
- అవినీతి, కుటుంబ పెత్తనంపై తీవ్ర వ్యతిరేకత

పుత్తూరు అర్బన్, జూన్ 5: ప్రజలకు అనుగ్రహం వచ్చినా... ఆగ్రహం వచ్చినా ఒక రేంజ్‌లో ఉంటుందని పొలిటికల్ సర్కిల్స్‌లో ఒక సామెత తిరుగాడుతా ఉంటుంది. అది నగరి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రోజాకు సరిగ్గా సరిపోతుంది. రెండు దఫాలు అనుగ్రహించిన నగరి నియోజకవర్గ వాసులు ఈ సారి కనికరం చూపలేకపోయారు. మంత్రి హోదాలో ఎన్నికల బరిలో నిలిచిన రోజాకు నగరి ప్రజలు ఇచ్చిన తీర్పు వైసీపీ శ్రేణులకు పీడకలను మిగిల్చిందనే మాటలు వినబడుతున్నాయి. మండలాల వారీగా కుటుంబ సభ్యులకు పెత్తనాన్ని అప్పగించడం, తీవ్రమైన అవినీతి ఆరోపణలు రావడం ఆమె పట్ల ప్రజల్లో వ్యతిరేకత ప్రబలడానికి కారణంగా తెలుస్తోంది. దీనికి తోడు అధికారంలోకి వచ్చిన వెంటనే చెప్పుడు మాటలు విని సమర్థులైన నాయకులను, వ్యక్తులను కోల్పోవడం కూడా ఆమె భారీ ఓటమిని చవిచూడడానికి దోహదం చేసిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



మంగళవారం నాడు కౌంటింగ్ కేంద్రం నుంచి నిరాశతో వెనుదిరుగుతున్న రోజా

రెండు దఫాలు సువర్ణావకాశం

స్థానికేతరురాలు అయినప్పటికీ నగరి నియోజకవర్గం రోజాను ఆదరించింది. 2014 ఎన్నికల్లో వైసీపీ తరఫున నగరి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేటప్పటికీ రోజా అప్పటికే గత రెండు ఎన్నికల్లోనూ నగరి, చంద్రగిరి నుంచి పోటీ చేసి ఓడిపోయింది. మూడోసారి తనను గెలిపించాలని రోజా చేసిన అభ్యర్థనను పార్టీలకు అతీతంగా నగరి ఓటర్లు స్పందించారు. ప్రత్యర్థిగా అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే గాలి ముద్దుకృష్ణమనాయుడు పోటీ చేస్తున్నప్పటికీ రోజాను స్వల్ప తేడాతోనైనా గెలిపించి అసెంబ్లీకి పంపించారు. 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభంజనం తోడైనప్పటికీ టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన గాలి భానుప్రకాష్‌పై 2708 ఓట్ల తేడాతో గెలుపు సాధించారు. వైసీపీ అధికారంలోకి రావడంతో తొలి రెండున్నరేళ్ల ఏపీఐఐసీ చైర్‌పర్సన్‌గా, చివరి రెండున్నరేళ్ల రాష్ట్ర మంత్రి అవకాశం దక్కించుకున్నారు. నగరి ప్రజలు ఆదరణతో రాజకీయంగా ఉన్నత శిఖరాలను అధిరోహించారు.

మూటగట్టుకున్న తీవ్ర వ్యతిరేకత

2019 ఎన్నికల తరువాత వైసీపీ రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో నియోజకవర్గంలోని మండలాలను కుటుంబసభ్యులకు అప్పగించడం, అవినీతి ఆరోపణలు హెచ్చుమీరడంతో రోజా ప్రభ కొడిగట్టడం ప్రారంభించిందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. దీనికి తోడు చెప్పుడు మాటలు వినడంతో అసమర్థులు అందలం ఎక్కడం కూడా జరిగిపోయింది. దీంతో సమర్థులుగా పేరుబడ్డ ఒక్కొక్క నాయకుడు రోజా వ్యవహారశైలితో ఇబ్బందులకు గురై గుడ్‌బై చెప్పారు. ప్రధానంగా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండకపోవడం, సమస్యలు చెప్పుకోవాలంటే నగరి ప్యాలెస్ ముందు రోజుల తరబడి వేచి ఉండాల్సి రావడం కూడా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతకు కారణమైందనే మాటలు వినబడుతున్నాయి. ఫలితంగా ఎన్నికల్లో 45,004 ఓట్ల తేడాతో ఓటమిని చవిచూడాల్సి రావడం మాత్రం వైసీపీ శ్రేణులకు మింగుడుపడడం లేదు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి గోపాలకృష్ణ

పుత్తూరు అర్బన్, జూన్ 5: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని పుత్తూరు జూనియర్ సివిల్ జడ్జి గోపాలకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక సబ్‌కోర్టులో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ద్వారా భావితరాలకు మెరుగైన జీవనాన్ని కల్పించినట్లు అవుతుందన్నారు. అనంతరం న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో పర్యావరణ పరిరక్షణ ప్రమాణం చేశారు.

పుత్తూరు: భావితరాలకు భరోసాను ఇచ్చేందుకు పర్యావరణాన్ని పరిరక్షించాలని డీవైఈవో ప్రభాకరరాజు కోరారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. పర్యావరణ పరిరక్షణ మీద విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. ఎంఈవోలు తిరుమలరాజు, బాలసుబ్రహ్మణ్యం, బాలికల కళాశాల ప్రిన్సిపాల్ రఘుపతి పాల్గొన్నారు.

పేదల డాక్టర్ రవిరాజు



డాక్టర్ రవిరాజును సన్మానిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

పుత్తూరు అర్బన్, జూన్ 5: జిల్లా వైద్యాధికారిగా ఇటీవల పదవీ విరమణ పొందిన డాక్టర్ రవిరాజును వైద్య ఆరోగ్య సిబ్బంది పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం ఘనంగా సన్మానించారు. దుశ్శాలువ, గజపూలదండతో ఆయనను సత్కరించారు. పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న సమయంలో బీపీ, షుగర్ రోగులకు ప్రతి మంగళవారం చికిత్సతో పాటు మందులను అందించి పేదల డాక్టర్‌గా గుర్తింపు పొందారని వారు కొనియాడారు. సిబ్బంది పట్ల గౌరవభావంతో పాటు ఆదరాభిమానాలు చూపారని గుర్తు చేసుకున్నారు.